Regd No H.034 Andhra Janatha Hyderabad

# ఆంధ్రజనత

సంపాదకుడు: కె. యస్. సుబ్రహ్మణ్యం

హైదరాబాద్, గురువారం 17-9-1959

సంపుటి 5 సంచిక 83

ఆంధ్రజనత
చందా వివరాలు
సంవత్సరం రూ. 27—00
6 నెలలు రూ. 14—00
3 నెలలు రూ. 7—00
మూడు నెలలకు తక్కువ చందా స్వీకరించబడదు.
వివరాలకు:
మేనేజర్,
ఆంధ్ర జనత
గాంధీ భవనం, హైదరాబాదు.

DEPT. OF INFORMATION & PUBLIC RELATIONS
GOVT. OF ANDHRA PRADESH, HYDERABAD
NEWS PAPER RECORDS
FILE COPY

24 సంవత్సరాల అనుభవము. వేలకొలది కేసులు బాగుచేసినాము
వరి బీజము (బుడ్డ)
ఆపరేషన్ లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును.
రే అండ్ కో (రిజిష్టర్డ్)
హెడ్ ఆఫీసు, గౌలిగూడ, నయా బస్ డిపో ఎదుట,
హైదరాబాద్ ఆంధ్ర ప్రదేశ్ రాజధాని,
బ్రాంచి:- గాంధీనగరం, తాలూకా ఆఫీసు ఎదుట, విజయవాడ-2.
(Khan & Sons)

# గోదావరి వరదలు: గండం దాదాపు గడచినట్టే

## పరిస్థితిని స్వయంగా పరిశీలించి వచ్చిన ముఖ్యమంత్రి ప్రకటన

### ఏటిగట్టు పొడుగునా కట్టుదిట్టమైన రక్షణ ఏర్పాట్లు; వరద నిరోధానికి సమగ్ర పథకం అవసరం అని శ్రీ సంజీవరెడ్డి వివరణ

("ఆంధ్రజనత" ప్రత్యేక విలేఖరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 16

"గండం దాదాపు గడిచినట్టే"; విమానంలో వెళ్ళి గోదావరి వరద ప్రాంతాలను చూసి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారు విలేఖరులకు వెల్లడించిన అభిప్రాయం ఇది.

ధవళేశ్వరం వద్ద నది నీటి మట్టం 19 అడుగుల వరకు పెరిగితే పెరగవచ్చు. కాని రాజమహేంద్రవరానికి, లేదా ఇతర ప్రాంతాలకు 1953 నాటి ప్రమాదం మళ్ళీ సంభవించడనే తాను విశ్వసిస్తున్నానని ముఖ్య మంత్రి తెలియజేసారు. నేటి సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 18.5 అడుగుల వరకు పెరిగింది. ఇది ఇంకో అరఅడుగు పెరగవచ్చు. అయినప్పటికీ యేటి గట్లకు గండ్లు పడవనే అనుకుంటున్నారని శ్రీ సంజీవరెడ్డి అన్నారు. ఏది ఏమైనప్పటికీ, రేపుమధ్యాహ్నం వరకు తట్టుకుంటే, ఆ తర్వాత ఇక వరద తప్పకుండా తగ్గుముఖం పడుతుందని తాను అనుకుంటున్నానని శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

రాజమహేంద్రవరంలో కాని, అమలాపురం, రాజోలు తాలూకాలలో కాని వరద నీరు ఎక్కడా లేదని శ్రీ సంజీవరెడ్డి అన్నారు. అయితే, ఈ ప్రాంతాలలో కొన్ని చోట్ల మురికి కాల్వల నీళ్ళు పైకి రావటం వల్ల వాటిని ఖాళీ చేయవలసి వచ్చిందని ముఖ్య మంత్రి అన్నారు.

నీటి ఎగువ ప్రాంతాలలో కెల్లా కూనవరానికి, గట్టిగా వరద దెబ్బ తగిలిందని ముఖ్య మంత్రి అన్నారు. రెండు మూడు ఇళ్ళు తప్పించి కూనవరం అంతా నీట మునిగిందని ఆయన అన్నారు. పోలవరం కూడా జలమయమైనది. భద్రాచలంలో మెట్ట ప్రాం

(మిగత 4 వ పేజీ)

## రాజమండ్రి టౌన్‌లో 4 అడుగులలోతు నీరు, 50 వేల మందికి దెబ్బ

హైదరాబాద్, సెప్టెంబర్ 16

వరద వివరాలకు సంబంధించి పి.టి.ఐ. విలేఖరి ఈ విధంగా రాస్తున్నాడు:

రాజమండ్రిలోను, గోదావరి టౌన్‌లోను దాదాపు 2 చదరపు మైళ్ళ మేర పల్లపు ప్రాంతాలన్నీ రెండు, లేక నాలు గడుగుల నీళ్ళలో మునిగిపోయి ఉన్నాయి. ప్రజలు చాలా మంది ఇళ్లు ఖాళీ చేసి మరో చోట తలదాచుకుంటున్నారు.

ఏటి గట్టుకు ఎక్కడా గండి పడలేదు. కేవలం డ్రైనేజ్ నీళ్ళతోనే ఈ ప్రాంతాలు నిండిపోయాయి. నదిలో నీటి మట్టం 15 అడుగుల దాకా దిగితేనే గాని డ్రైనేజ్ నీళ్లు నదిలోకి వెళ్లటానికి వీలు చిక్కదు.

మొత్తం మీద ఈ వరదల మూలంగా రాజమండ్రి టౌన్‌లో 25 వేల మంది, ఏటుగట్టు పొడుగునా ఉన్న ఏడు మునిసిపల్ వార్డులలో 25 వేల మంది దెబ్బ తిన్నారు. వీరంతా ఎక్కువ భాగం కూలీలు, మధ్య తరగతికి చెందిన ప్రజలు. నీళ్లలో మునిగిపోయినప్రాంతాలలోనివారందరికీ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను, మునిసిపల్ ఆఫీసులోనూ, ఎలిమెంటరీపాఠశాలల్లోనువసతి సౌకర్యాలు కల్పించబడ్డాయి. గౌతమీ జీవకారుణ్య సంఘం, వరద సహాయక సంఘాల ఆధ్వర్యాన ఉచిత భోజన ఏర్పాట్లు కూడా కల్పించబడ్డాయి ప్రతి దినం దాదాపు 2వేల మంది బీద ప్రజలకు భోజనం పెట్టబడుతున్నది.

వరద సహాయక కార్యక్రమాలకు సంబంధించి అధికారులు ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఒకదాన్ని ఏర్పాటు చేశారు. సబ్ కలెక్టర్ శ్రీ కె. వి. నటరాజన్ అజమాయిషీ క్రింద పగలూ, రాత్రి 24 గంటలు ఇది పని చేస్తున్నది. పరిస్థితి విషమిస్తే వెంటనే దాన్ని ఎదుర్కోవటానికి గాను లారీలు, పడవలు అందుబాటులో ఉంచబడ్డాయని సబ్ కలెక్టర్ విలేఖరులకు తెలియజేశారు. డెల్టా ప్రాంతంలోని లంకలన్నీ ఖాళీచేయబడ్డాయి. వనిదొరకని హరిజన కూలీలకు గడ్డు దినాలు గడిచే వరకు ఉచితంగా బియ్యం సప్లయి చేయబడుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలోని శీతానగరం, వంగలపూడి తదితర గ్రామాలలో చౌక ధరలకు బియ్యం అందజేయటానికి గాను 100 బస్తాల బియ్యం అక్కడికి పంపటానికి ఏర్పాట్లు చేయబడ్డాయి. స్థానిక రెడ్‌క్రాస్ సంఘంవారు కూడా బాధితులకు బియ్యం, పాలపొడి సహాయం చేస్తున్నారు. అంటువ్యాధులేవీ లేకుండా మున్సిపల్ అధికారులు టీకాలు మొదలైన జాగ్రత్తలన్నీ తీసుకొన్నారు. వరద తగిలిన ప్రాంతాలలోని వారికి మంచి నీటిని సప్లయి చేస్తున్నారు. నీళ్లు నిలిచిపోయిన ప్రాంతాలలో నీటిని తోడివేయటానికి గాను స్పెషల్ పంపులు ఏర్పాటు చేయబడ్డాయి. మాజీ మంత్రి శ్రీ ఎ. వి. నాగేశ్వరరావుగారు వరద పరిస్థితిని ఎదుర్కోవటంలో అధికారులు, అనధి

(మిగతా 4 వ పేజీలో)

## ఢిల్లీ-మద్రాసు ఎక్స్‌ప్రెస్ ట్రైయిన్లు మన్నాడ్ మీదుగా మళ్ళింపు

బొంబాయి, సెప్టెంబర్ 16

బలార్షా-మానిక్‌ఘర్ మార్గంలో రైలు కట్ట మీదుగా వరద నీరు ప్రవహిస్తున్న కారణంగా మద్రాసు-ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ట్రైయిన్లు మన్నాడ్ మార్గంలో నడుస్తున్నాయి. వరద నీరు ఇంకా ప్రవహిస్తున్న కారణంగా ట్రైయిన్లను మామూలు మార్గంలోకి తిరిగి మళ్ళించటం జరగలేదనీ, ఇంకా మన్నాడ్ మార్గంలోనే ట్రైయిన్లు నడుస్తున్నాయనీ సెంట్రల్ రైల్వే నేడు ప్రకటించినది.

రైలు కట్టపై నాలుగు అడుగుల ఎత్తున వరద నీరు ప్రవహిస్తున్నది. గండ్లు మరమ్మతు చేయటానికి ఇంకా కొన్ని రోజులు పడుతుందని సెంట్రల్ రైల్వే ప్రకటించినది.

ఢిల్లీ-మద్రాసు ప్రయాణీకుల సౌకర్యార్థం కొన్ని అదనపు ఏర్పాట్లను చేసినట్టు కూడా ప్రకటించబడినది.

## మధ్య ప్రదేశ్‌లో వరద నష్టం

ఇండోర్, సెప్టెంబర్ 16

మధ్యప్రదేశ్, ధార్ జిల్లాలోని బర్వాన్, మానవార్ తాలూకాలలో వరదల వల్ల 9 మంది మరణించారనీ, వెయ్యి ఇండ్లు కూలిపోయాయనీ తెలుస్తున్నది.

గత వారంలో పై జిల్లాలలో పది అంగుళాల వర్షం కురిసినది. వర్షాల ఫలితంగా ఒక బ్రిడ్జి కొట్టుకొని పోయినది.

## సుందరయ్యగారి విమర్శ కడు శోచనీయం

### ఆర్థికమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ఖండన

("ఆంధ్రజనత" విలేఖరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 16

ఉద్యోగుల జీత భత్యాలపై వేతనాల కమిటీ పరిశీలన జరుపుతున్నప్పుడు కమిటీ సిఫార్సులన్నిటి పట్ల సంపూర్ణ సంతృప్తిని ప్రకటించి, కమిటీ సిద్ధ పరచిన ఏకగ్రీవ నివేదికపై ఇష్టపూర్వకంగా సంతకం చేసిన తర్వాత ఇప్పుడు ప్రతిపక్ష నాయకులు శ్రీ పి. సుందరయ్య ఆ సిఫార్సులపై విమర్శలకు పూనుకోవటం శోచనీయమని ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ప్రకటించారు.

వేతనాల కమిటీ సిఫార్సులపై శ్రీ సుందరయ్య చేసిన ఆరోపణలకు సమాధానమిస్తూ వ్రాసిన ఒక లేఖలో ఆర్థిక మంత్రి పై విధంగా ప్రకటించారు.

శ్రీ సుందరయ్య ఆరోపణలను ఖండించటానికి గాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేఖరుల గోష్ఠిలో ఆర్థిక మంత్రి ఆ లేఖను ప్రచురణార్థం విడుదల చేశారు.

తమ లేఖలో ఆర్థిక మంత్రి శ్రీ సుందరయ్య లేవదీసిన ప్రతి అంశానికి సమాధానమిచ్చారు. వేతనాల కమిటీ ఏకగ్రీవనివేదికపై ఆయన(సుందరయ్య) ఇష్టపూర్వకంగా సంతకం చేసిన తరువాత ఆయన పార్టీ (కమ్యూనిస్టుపార్టీ) ఆయనను నష్టేట వదిలివేసి కమిటీ సిఫార్సులను వ్యతిరేకించటం శోచనీయమైన విషయమని, ఈ తర్కం కేవలం పార్టీ ప్రయోజనాల దృష్ట్యా తలపెట్టినదేనని ఆర్థిక మంత్రి అన్నారు.

శ్రీ సుందరయ్య సమాధానం చేకముందే తమ లేఖను పత్రికలకు విడుదల చేయటం విచారకరమైన విషయమని, ఆయన లేఖకు పత్రికలలో ప్రచారం లభించినది గనక తమ లేఖను పత్రికలకు విడుదల చేయని పక్షంలో వేతనాల కమిటీ పట్ల ప్రభుత్వోద్యోగుల పట్ల తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వహించనివాడనౌతానని ఆర్థిక మంత్రి తమ లేఖలో తెలిపారు.

తమ రాజీనామా ఆరోపించబడిందీ లేనిదీ తెలపక, తమను అంధకారంలో ఉంచారని శ్రీ సుందరయ్యచేసిన ఆరోపణను ఆర్థిక మంత్రి ఖండించారు. దీర్ఘ కాలం పాటు విదేశానికి వెళ్లవలసిన కారణంగా ఆయన తమ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చారు గనక, పైగా

(మిగతా 4వ పేజీలో)

## వృద్ధ శార్దూలం

కోయంబత్తూర్, సెప్టెంబర్ 16

రాజాజీ ఈ రోజున ఇక్కడ ఒక సభలో తనని తాను ఒక వృద్ధ శార్దూలంతో పోల్చుకున్నారు.

కేవలం పులి చర్మం కప్పుకోవటం కాదు నిజంగా గాండ్రిస్తున్న పెద్ద పులినని ఆయన అన్నారు.

"ముసలివైనా పెద్దపులి ఎప్పటికీ పెద్దపులే."

స్వతంత్ర పార్టీ నాయకుడుగా తను ఇప్పుడు ముందుకు రావటం కాంగ్రెస్ వాళ్ళందరికీ చాలా భయంగా ఉందని కూడా ఆయన అన్నారు.

## బూర్గుంపాడు తాలూకాలో 80 గ్రామాలు ముంపు

హైదరాబాద్, సెప్టెంబర్ 16

బూర్గుంపాడు వద్ద గోదావరి నీటి మట్టం 172.5 అడుగుల ఎత్తుదాకా పెరిగినట్టు తాజా వార్తలు తెలుపుతున్నాయి.

ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు వరద ప్రాంతాలకు తరలి వెళ్లారు.

బూర్గుంపాడు తాలూకాలో దాదాపు 80 గ్రామాల వరకు మునిగిపోయినట్టు తెలుస్తున్నది. వేల వేల మంది ఇళ్ళు ఖాళీ చేసి వెళ్ళిపోయారు.

బాధితులకు ఆహారం, మందులు సప్లయి చేయబడుతున్నాయి.

## మూడవ ప్రణాళికలో రాష్ట్ర పథకాలు

### త్వరలో అఖిలపక్ష సలహాసంఘం నియామకం

("ఆంధ్రజనత" విలేఖరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 16

రాష్ట్రానికి సంబంధించి, మూడవ పంచవర్ష ప్రణాళికా పథకాలను రూపొందించటంలో సలహాలు ఇవ్వటానికి గాను, అన్ని రాజకీయ పక్షాలకు ప్రాతినిధ్యం ఉండేటట్టు సెలాఖరులోగా ఒక సలహా సంఘాన్ని నియమించ గలమని ఆర్థిక మంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నేడు ఇక్కడ విలేఖరుల గోష్ఠిలో వెల్లడించారు.

వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, ఇరిగేషన్ సౌకర్యాలు మొదలైన అంశాలకు సంబంధించి వివిధ పరిశీలక సంఘాలు చిత్తు అంచనాలను రూపొందించాయనీ, మూడవ ప్రణాళికలో రాష్ట్ర పథకాలకు 350 కోట్ల రూపాయలు ఖర్చు కాగలదని అంచనా వేసారనీ ఆయన వెల్లడించారు.

రాష్ట్రావసరాలను, అందుబాటులో ఉన్న సాధన సంపత్తిని, యావద్దేశం ఖర్చును దృష్టిలో పెట్టుకుని ప్లానింగ్ కమిషన్ పై అంచనాలను నిర్ధారించ వలసి ఉంటుందని శ్రీ బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు.

మూడవ పంచవర్ష ప్రణాళికలో సైతం ఇరిగేషన్, విద్యుచ్ఛక్తి సౌకర్యాలకు ఇతోధిక ప్రాధాన్యం ఇవ్వబడుతుందనీ,అయితే పరిశ్రమలకు కూడా వెనుకటికంటె ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారనీ ఆయన వెల్లడించారు.

అఖిలపక్ష సంఘంలో శాసన సభ్యులు, కొందరు ఇతరులు కూడా సభ్యులుగా ఉంటారు.

## విద్యుచ్ఛక్తి బోర్డు రుణం సేకరించే సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 16

విద్యుచ్ఛక్తి అభివృద్ధికి గాను ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డు త్వరలో రెండు కోట్ల రూపాయల రుణాన్ని సేకరించటం సంభవం.

క్రిందటి నెల రాష్ట్ర ప్రభుత్వం 6 కోట్ల రుణాన్ని సేకరించటంలో కనిపించిన ప్రోత్సాహాన్ని పురస్కరించుకుని విద్యుచ్ఛక్తి బోర్డు రుణాన్ని సేకరించటానికి ఇది అదనుగా భావించబడినది.

విద్యుచ్ఛక్తి బోర్డు ఇందుకు గాను విజ్ఞప్తి చేసిన పక్షంలో ప్రభుత్వం సుముఖంగా పరిశీలించ గలదని నేడు విలేఖరుల గోష్ఠిలో ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి ప్రకటించారు. చట్టం ప్రకారం రుణ సేకరణకు ముందు విద్యుచ్ఛక్తి బోర్డు రిజర్వు బ్యాంక్, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి పొంద వలసి ఉంటుంది.

## విదర్భ ప్రదర్శకులపై లాఠీలు

అకోలా, సెప్టెంబర్ 16

ప్రత్యేక విదర్భ రాష్ట్రం ఏర్పాటు చేయాలన్న నినాదాలతో నేడు ఇక్కడ ప్రదర్శనలు జరిపిన 5 వేల మంది జన సమూహంపై పోలీసులు లాఠీ ప్రయోగం జరిపారు.

స్వరాజ్య భవన్‌లో విదర్భ కాంగ్రెస్ కమిటీ సమావేశం పూర్తి అయిన తర్వాత ప్రదర్శకులు అక్కడికి పోలీసు వలయాన్ని భేధించుకొని లోపల ప్రవేశించటానికి ప్రయత్నించారు. పోలీసులపై రాళ్లు రువ్వటం జరిగినది.

గుంపుని అదుపులో పెట్టటానికి గాను పోలీసులు లాఠీ ప్రయోగం జరిపారు 45 మందికి గాయాలు తగిలాయి. రాళ్ళ దెబ్బల వల్ల 28 మంది పోలీసులకు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌కు కూడా గాయాలు తగిలినట్టు పోలీసు అధికారులు అన్నారు.

నాగ విదర్భ ఆందోళన అధ్వర్యాన ఈ ప్రదర్శనలు జరిగాయి.

## విదర్భ నినాదం మూల పడ్డట్టే

### ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ తీర్మానం

అకోలా, సెప్టెంబర్ 16

విదర్భ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ నేడు ఇక్కడ సమావేశమై ప్రస్తుత బొంబాయి రాష్ట్రాన్ని రెండు రాష్ట్రాలుగా-గుజరాత్, బొంబాయి పట్టణంతో కలిపి మహారాష్ట్ర-విభజించాలని తీర్మానించినది.

విదర్భ, మరాట్వాడా, మహారాష్ట్ర ప్రాంతాలన్నిటినీ కలిపి బొంబాయి

(మిగతా 4 వ పేజీలో)

## స్థానిక సంస్థల ఉద్యోగుల జీత భత్యాల సవరణ

### దసరానాటికి ప్రభుత్వ నిర్ణయం సంభవం

("ఆంధ్రజనత" విలేఖరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 16

స్థానిక సంస్థల ఉద్యోగుల జీతభత్యాలకు సంబంధించిన వేతనాల కమిటీ నివేదిక రెండవ భాగం సిద్ధంగా ఉన్నదని, ప్రభుత్వం వారికి ఆర్థిక సహాయం అందజేస్తూ త్వరలోనే—బహుశా దసరా కానుకగా — ఉత్తర్వులు జారీ చేయవచ్చునని తెలుస్తున్నది.

ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నేడు ఇక్కడ పత్రికా విలేఖరుల గోష్ఠిలో ఈ విషయం సూచించారు. వేతనాల కమిటీ సిఫార్సులపై ప్రతిపక్ష నాయకుడు శ్రీ పి. సుందరయ్య చేసిన విమర్శలను ఖండించటానికే ఆర్థిక మంత్రి ఈ గోష్ఠిని ఏర్పాటు చేశారు. శ్రీ సుందరయ్య వేతనాల కమిటీలో సభ్యుడుగా పనిచేశారన్న విషయం పాఠకులకు విదితమే.

## నల్ల జెండాలు: రాజాజీ విచారం

కోయంబత్తూరు, సెప్టెంబర్ 16

కాంగ్రెస్ అంత పెద్ద సంస్థ కేవలం ఏదో చిల్లర పార్టీల మాదిరిగా నల్ల జెండాల ప్రదర్శనాలకు పూనుకోవటం చాలా విచారకరం అయిన విషయం అని శ్రీ సి. రాజగోపాలాచారి నేడు ఇక్కడ అన్నారు.

రాజాజీ ఇటీవల మధుర వెళ్లినప్పుడు ఆయనకి వ్యతిరేకంగా అక్కడ నల్ల జెండాలు ప్రదర్శించబడ్డాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొనే రాజాజీ పై విధంగా అన్నారు.

కోయంబత్తూరులో అయితే అటువంటి దేమీ జరుగ లేదనీ, కొంత వరకు అది ఆశాభంగం కల్గిస్తున్నదనీ ఆయన అన్నారు.

## "పుష్పక" విమానంలో బూర్గుల విహారం

త్రివేంద్రం, సెప్టెంబర్ 16

త్రివేంద్రం విమానాశ్రయంలో కొత్తగా స్థాపించిన కేరళ ట్రైయింగ్ క్లబ్‌కు గవర్నర్ డాక్టర్ బూర్గుల రామకృష్ణరావుగారు నేడు ప్రారంభోత్సవం చేసారు.

ప్రారంభోత్సవం పూర్తయినతర్వాత "శీఘ్ర విమానమైన" "పుష్పక్"లో డాక్టర్ రామకృష్ణరావుగారు విమానాశ్రయంపై కొద్దిసేపు విహరించారు.

పై పుష్పకవిమానం బెంగుళూరులోని హిందూస్తాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్యాక్టరీలో నిర్మించబడినది.

## ఫతేమైదాన్‌లో స్టేడియం

### వచ్చే నెల శంకుస్థాపన

హైదరాబాద్, సెప్టెంబర్ 16

ఫతేమైదానంలో స్టేడియం నిర్మాణానికి వచ్చే నెలలో శంకుస్థాపనోత్సవం జరగగలదని ఆర్థిక మంత్ర శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి నేడు వెల్లడించారు.

స్టేడియం నిర్మాణం మూడు సంవత్సరాలు పట్టగలదనీ, అందుకు 30 లక్షల రూపాయలు ఖర్చు కాగలదని ఆయన తెలియజేశారు.

వైనీస్ గార్డెన్ (పబ్లిక్ గార్డెన్)లో బహిరంగ స్థలం నిర్మించ బడగలదనీ, ఇందుకు రెండున్నర లక్షల రూపాయలు ఖర్చు కాగలదనీ ఖర్చులో లక్ష రూపాయలను కేంద్రం భరిస్తుందనీ ఆయన తెలియ జేసారు.

## న్యూయార్క్ పత్తి

న్యూయార్క్, సెప్టెంబర్ 16

| | |
|---|---|
| నేటి ప్రారంభ ధర | 32.62 |
| నేటి ముగింపు ధర | 32.51 |

## సమితిలో చైనా ప్రాతినిధ్యానికి ఇండియా పునః ప్రయత్నం

### ప్రతిపాదన త్రోసివేత

ఐక్యరాజ్య సమితి,

న్యూయార్కు, సెప్టెంబర్ 16

ఐక్యరాజ్య సమితిలో చైనా ప్రాతినిధ్యం విషయం పై జనరల్ అసెంబ్లీ చర్చించాలని ఇండియా నేడు లాంఛనంగా తిరిగి ప్రతిపాదించినది.

ప్రపంచం లోని పెద్ద దేశాలలో ఒకటైన చైనా దేశానికి సమితిలో ప్రాతినిధ్యం ఉండాలని తన ప్రభుత్వం వాంఛిస్తున్నదని భారత రక్షణ మంత్రి, ప్రతినిధివర్గ నాయకుడు శ్రీ వి.కె. కృష్ణ మీనన్ సారధ్య సంఘ సమావేశంలో అన్నారు.

అయితే సమితి సారధ్యం ఇండియా ప్రతిపాదనను అంగీకరించక, దానికి బదులు ఐక్యరాజ్య సమితిలో ప్రస్తుతం జాతీయ చైనా ఉన్న స్థానంలో పెకింగ్ ప్రతినిధిని కూర్చోపెట్టటానికి జరిగే ఏ ప్రయత్నాన్నీ అంగీకరించలేదు. అమెరికా ప్రతిపాదించిన తీర్మానాన్ని సారధ్య సంఘం ఆమోదించినది.

## ఆల్జీరియా సమస్య

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబర్ 16

ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ చర్చ నియాంశాలలో ఆల్జీరియా విషయాన్ని జేర్చాలని సమితి సారధ్య సంఘం నేడు సిఫార్సు చేసినది.

ఫ్రాన్స్ ప్రతినిధి ఎమ్. ఆర్ మాండ్ జెరార్డ్ అసెంబ్లీలోని ఎజెండాలో ఆల్జీరియా విషయాన్ని జేర్చటానికి అభ్యంతరం ప్రకటించారు.

## సరిహద్దు పరిస్థితి నిశ్చలం

### జనరల్ తిమ్మయ్య ప్రకటన

కలకత్తా, సెప్టెంబర్ 16

సరిహద్దు పరిస్థితి ప్రస్తుతం ఎటువంటి మార్పు లేకుండా దాదాపు నిశ్చలంగా ఉన్నదని సైన్యాధిపతి జనరల్ తిమ్మయ్య నేడు ఇక్కడ విలేఖరులతో అన్నారు.

పరిస్థితి అంతా ఇప్పుడు రాజకీయజ్ఞుల చేతుల్లో వదిలిపెట్టబడిందని ఆయన అన్నారు.

## ఒరిస్సా అసెంబ్లీలో వాకౌట్

భువనేశ్వర్, సెప్టెంబర్ 16

శాసన సభ్యులు వరద ప్రాంతాలలో పర్యటించటానికి వీలుగా సభను వచ్చే సోమవారం వరకు వాయిదా వేయాలని మొదట ముఖ్యమంత్రికి, తర్వాత స్పీకర్‌కు చేసిన విజ్ఞప్తి నిరాకరించబడినందుకు నిరసనగా ఒరిస్సా అసెంబ్లీలోని ప్రతిపక్ష సభ్యులు నేటి మధ్యాహ్నం సభ నుంచి వాకౌట్ చేశారు.

పారిస్, సెప్టెంబర్ 16

ఇండియా ఆర్థికమంత్రి శ్రీ మొరార్జీ దేశాయి స్విట్జర్‌లాండు నుంచి నేడు ఇక్కడికి వచ్చారు.

## 26 గ్రామాలకు ఇతర ప్రపంచంతో సంబంధం లేదు

హైదరాబాద్, సెప్టెంబర్ 16

తూర్పు గోదావరి జిల్లాలో దాదాపు 26 గ్రామాలు వరద నీళ్ళలో చిక్కుకొని ఇతర ప్రపంచంతో సంబంధం లేకుండా తెగిపోయినట్టు తాజావార్తలు తెలుపుతున్నాయి.

వరద నీళ్ళలో చిక్కుకున్న గ్రామాలలోని ప్రజలను అక్కడ నుంచి ఖాళీ చేయించటానికి లాంచీలు నడుప బడుతున్నాయి.

## గంటకు అరంగుళం పెరుగుదల

హైదరాబాద్, సెప్టెంబర్ 16

తాజా వార్తల ప్రకారం గోదావరి నీటి మట్టం ప్రస్తుతం గంటకు అరంగుళం చొప్పున పెరుగుతున్నట్టు తెలుస్తున్నది.

— ఎ. ఎస్. ఎస్.

## నెహ్రూకు స్వాగతం ఇవ్వటానికి పెద్ద యెత్తున ఏర్పాట్లు

### ఇరాన్‌లో

టెహరాన్, సెప్టెంబర్ 16

ఇరాన్ ప్రభుత్వము, ఇరాన్‌లోని భారతయులు రేపు (18 తేదీ) ప్రభుత్వ ఆహ్వానంపై యిక్కడకు వస్తున్న భారత ప్రధాని నెహ్రూకు యిచ్చే స్వాగత యేర్పాట్లలో నిమగ్నులైనారు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి శ్రీ యన్. ఆర్. పిళ్ళై, భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఇందిరా గాంధీ గారలతో కలసి ప్రధాని నెహ్రూ 18వ తేదీ టెహరాన్ వచ్చి, నాలు రోజులు ఇరాన్ ప్రభుత్వ అతిథిగా వుంటారు. శ్రీ నెహ్రూ బృందం ఇరాన్ రాజు వేసవి భవనంలో బస చేస్తారు. రాష్ట్రాలలో, జిల్లాలలో వుంటున్న భారతీయ వర్తకులు, వ్యాపారులు అధిక సంఖ్యాకులుగా టెహరాన్ చేరుకుంటున్నారు నెహ్రూకు స్వాగత మివ్వటంకు.

ఇరాన్ రాజు షా తెజా పహ్లవీతో విందారగించి, ప్రధాన మంత్రితో భారత-ఇరాన్ సమస్యలు గురించి మంతనాలు జరుపుతారు. టెహరాన్ నగర గౌరవ పౌరస్వత్వము.

## క్రుశ్చేవ్ దీక్ష

వాషింగ్‌టన్, సెప్టెంబర్ 16

ఐసెన్‌హోవర్‌తో జరుపుతున్న చర్చలలో "ప్రచ్ఛన్న యుద్ధాన్ని అంతం చేసి, శాంతిని కట్టుదిట్టం చేయటానికి, అంతర్జాతీయ ప్రతిష్టంభనను సడలింప చేయటానికి ముఖ్యంగా కృషి జరుపుతానని సోవియట్ ప్రధాని క్రుశ్చేవ్ నేడు ఇక్కడ నేషనల్ ప్రెస్ క్లబ్‌లో గావించిన ప్రసంగంలో అన్నారు.

## హైదరాబాద్ ఆటుగానికి లండన్ ఎవార్డు

లండన్, సెప్టెంబర్ 16

ఇండియన్ క్రికెట్ జట్టులో ఒకడైన అబ్బాస్ అలీబేగ్‌కు అతని క్రీడా కౌశల్యానికి చిహ్నంగా 100గినియాల ఎవార్డు బహూకరించ బడింది.

మొదటి టెస్ట్ పోటీలో శ్రీ బేగ్ ఒక సెంచరీ, రెండవ టెస్టుపోటీలో 112 పరుగులు సాధించాడు.

## తాపి నది వరదలు

సూరత్, సెప్టెంబర్ 16

తాపి నదికి నిన్నటి నుంచి ఉధృతంగా వరదలు వచ్చాయి.

నదికి ఇరువైపులా డజను గ్రామాలు మునిగి పోయాయి. తాపి నది నీటిమట్టం రాత్రి 93 అడుగుల వరకు పెరిగినది. నేడు మట్టం 98.5 అడుగులు ఉన్నది.

మాండ్వి గ్రామంలో 300 కుటుంబాలకు తలదాచుకొనే చోటు లేకుండా పోయినది.

వికారి నామ సంవత్సరం
గురువారం, సెప్టెంబర్ 17,1959
భాద్రపద బహుళ పాడ్యమి
పాడ్యమి పూర్తి
పూ. భా. మ॥ 12-44
వర్జ్యం రా॥ 10-44 మొ॥ 12-24 కు

# ఆంధ్రజనత

టెలిఫోన్ నెంబరు : 4950

గురువారం, సెప్టెంబర్ 17, 1959

## ఆశాజనకం

ప్రపంచ ప్రజానీకం దృష్టి యావత్తూ ప్రస్తుతం ఇద్దరు వ్యక్తులపై కేంద్రీకృతమై ఉన్నది. అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఆహ్వానాన్ని పురస్కరించుకొని సోవియట్ ప్రధాన మంత్రి శ్రీ కృశ్చేవ్ మొన్న మంగళవారం నాడు అమెరికాలో పర్యటించటానికి న్యూయార్కు చేరుకున్నారు. శ్రీ కృశ్చేవ్ పర్యటించి వెళ్లిన తర్వాత శ్రీ ఐసెన్‌హోవర్ సోవియట్ రష్యాలో పర్యటిస్తారు. ఈ పర్యటనల సందర్భంగా ఉభయ దేశాలనాయకులు అంతర్జాతీయ సమస్యలపై చర్చలు జరుపుతారు. నిన్నటి వరకు ఎడముఖం, పెడ ముఖంగా ఉన్న రష్యా, అమెరికా ప్రభుత్వాధినేతలు ఒకరి దేశాన్ని మరొకరు సందర్శించటానికి అంగీకరించటమే పెద్ద విశేషం. ప్రపంచ ప్రజలు యావన్మందీ దీనిని అత్యంత ఆశాజనకమైన పరిణామంగా భావించారంటే, అందులో ఆశ్చర్యం లేదు. నిజానికి ఇది చరిత్రాత్మకమైనది. వీరుభయులు జరిపే సంభాషణల ఫలితంగా ప్రపంచ చరిత్ర మొత్తం గమనమే మారిపోవచ్చు. కనుక, వారి చర్చలకు అత్యధిక ప్రాముఖ్యం ఉన్నది.

ఇంతకు ముందెన్నడూ సోవియట్ రాజ్యాధినేత అమెరికా సందర్శించని కారణంగా, శ్రీ కృశ్చేవ్‌కు స్వాగతం చెప్పటంలో అమెరికన్ ప్రజలు హర్షం కంటె కుతూహలాన్ని ఎక్కువగా ప్రదర్శించారు. ఇది సహజమే. చంద్ర మండలానికి రాకెట్‌ను పంపగలిగినందుకు విజయగర్వాన్ని ప్రదర్శించి నప్పటికీ, తాను నిష్కల్మష హృదయంతో, సదుద్దేశంతో వచ్చానని, అమెరికాతో స్నేహపూర్వకమైన శాంతియుత సహజీవనాన్నే రష్యా వాంఛిస్తున్నదని శ్రీ కృశ్చేవ్ ఉద్ఘాటించారు. తన మట్టుకు తాను అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ అమెరికాకు దురాక్రమణ ఉద్దేశం ఎన్నడూ లేదనీ, అమెరికా దురాక్రమణ జరపటం అసంభవమని, అమెరికన్లు శాంతి కాముకులని శ్రీ కృశ్చేవ్‌ను ఆహ్వానిస్తూ చేసిన ప్రసంగంలో స్పష్టంచేశారు. రాకెట్ బలంలో రష్యాదే పై చెయ్యి అని అందరికీ తెలుసు. కాని దీనికి అమెరికా భయపడుతున్నట్టుగాని, దానివల్ల తాను రాజీపడ్డానికి రావలసి వస్తుందని గాని ఐసెన్‌హోవర్ ప్రసంగంలో ఎట్టి సూచనా కానరాలేదు. ఐసెన్‌హోవర్ వైఖరిలో ఇట్టి మార్పు రాగలదని శ్రీ కృశ్చేవ్ ఆశిస్తున్నారనటానికి కూడా ఎట్టి ఆధారం లేదు. కాని ఒకటి మాత్రం స్పష్టం. ఏ కారణం వల్లనైతేనేమి, రష్యా శాంతిని వాంఛిస్తున్న దనటంలో సందేహం లేదు. నిజానికి, బెర్లిన్ మొదలైన సమస్య లన్నిటినీ స్నేహపూర్వకంగా పరిష్కరించుకొని, ప్రపంచంలో ఉద్రిక్తతకు, యుద్ధ భయాన్ని తొలగించటానికి, తద్వారా యుద్ధ సన్నాహాల కయ్యే ఖర్చును మానవ కల్యాణానికి వినియోగించటానికి చిత్తశుద్ధితో కృషి చెయ్యాలని ఉభయ పక్షాల వారు కాంక్షిస్తున్నారు. ఇందుకు ఐసెన్‌హోవర్, కృశ్చేవ్‌ల చర్చలు దోహదం చేయగలవని, ఇప్పటికైనా ఈ ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నుంచి విముక్తి లభించ గలదని ప్రపంచ ప్రజలు ఆశిస్తున్నారు. ఈఆశ నిరాశ కాదని ఆశిద్దాం.

## తటస్థ విధానం
### ఇండియా, ఆఫ్ఘన్ ప్రధానుల సమర్థన

కాబూల్, సెప్టెంబర్ 15

సైనిక కూటాలతో సంబంధం పెట్టుకోకుండా ఉండటం, అన్ని దేశాల సహకారంతో పని చేయటం అన్న విధానాన్ని అవలంబించ వలసిన ఆవశ్యకత గురించి ఇండియా, ఆఫ్ఘనిస్తాన్ ప్రధానులు నేడు తిరిగి ఏకాభిప్రాయాన్ని ప్రకటించారు.

ప్రధాని నెహ్రూ గౌరవార్థం ఆఫ్ఘన్ ప్రధాని ఏర్పాటు చేసిన విందులో ప్రసంగిస్తూ ఉభయ దేశాలు అనుసరిస్తున్న విధానాలలో ఉన్న ఈ సామ్యం ఈ దేశాల మధ్య స్నేహ సంబంధాలు అభివృద్ధి చెందటానికి దోహదం చేస్తుందని వారు అన్నారు.

ప్రధాని నెహ్రూ సుమారు అరగంటసేపు ప్రసంగించారు. తమ ప్రసంగంలో శ్రీ నెహ్రూ వైజ్ఞానికంగా ప్రపంచం బాగా అభివృద్ధి చెందిన విషయం దృష్ట్యా శాంతి స్థాపనకోసం కృషిచేయవలసిన అవసరం బాగా పెరిగినదని అన్నారు. శాంతి అంటే యుద్ధం లేకపోవటమని అర్థం కాదని కూడా ప్రధాని అన్నారు.

ప్రపంచం నేడు శాంతిని కోరుతున్నది. అదే సమయంలో ప్రపంచంలోని అధిక భాగం నిర్విరామంగా యుద్ధ సన్నాహాలు చేస్తున్నది. అదిచాలా చిత్రమైన విషయం అని ప్రధాని అన్నారు.

కృశ్చేవ్-ఐసెన్‌హోవర్ సమావేశం ఆశాజనకమైన సంఘటన అని ప్రధాని అన్నారు.

అంతకు ముందు ప్రసంగిస్తూ ఆఫ్ఘన్ ప్రధాని సర్దార్ దావూద్ ఈ విధంగా అన్నారు:

రాజ్యాధినేతలు నేరుగా ఒకరితో ఒకరు సంభాషణలు జరపటం పరస్పర విభేదాలు తొలగించుకోటానికి ఉత్తమ మార్గమని మేము గతంలో అనేకసార్లు ప్రకటించాము. అందుకే రష్యా, అమెరికా ప్రభుత్వాలు ఇప్పుడు తీసుకొంటున్న చర్యలను మా ప్రభుత్వం హృదయపూర్వకంగా బలపరుస్తున్నది.

## కలకత్తాలో వరద బాధితులసహాయార్థం సైన్యానికి పిలుపు

కలకత్తా, సెప్టెంబర్ 15

జలాప్రళయమైన కలకత్తా తూర్పు భాగాలలోని ప్రజలను సంరక్షించేందుకై రాష్ట్ర ప్రభుత్వం వారు సైనిక సహాయం కోరినట్లుగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రతినిధి తెలియ పరిచారు. రోజంతా నిర్విరామంగా కురుస్తున్న వర్షాలవల్ల డండం, మణిక్తాలా, టాంగ్రా, టాలీగంజ్ మొదలైన ప్రాంతాలలో పరిస్థితి విషమించింది. వర్షాలవల్ల చెరువులుగా నిలబడిపోయిన నీటిని బయటకు పంపివేసేకృషి అంతగా సఫలం కాలేదు.

పరిస్థితి మరింత విషమించుటకు కారణం ఈ ప్రాంతాలలోని కాలువలన్నీ, చివరకు హుగ్లీ నదితోసహా పై అంచుల వరకు నిండివున్నాయి. ఒక్క చుక్క నీరు గూడా వాటిల్లోకి మళ్ళించటానికి వీలులేదు.

దీనికితోడు "సముద్రపు పోటు" కూడా వచ్చిపడే రోజులివి!

బెంగాల్ దక్షిణ జిల్లాలలో వరదలు అన్నీ పై అంచులకు యెగదట్టివున్నాయని వార్తలు అందినట్లుగా ఆ ప్రభుత్వ ప్రతినిధి అన్నారు.

## ప్రాంతీయ కొనుగోలు సలహా సంఘ సమావేశం

మద్రాసు, సెప్టెంబర్ 15

దక్షిణ మండల ప్రాంతీయ కొనుగోలు సలహా సంఘం మూడవ సమావేశం 1959 సెప్టెంబర్ 25 వ తేదీనాడు హైదరాబాద్‌లో జరుగుతుంది.

# ధోరణి-ప్రతిధ్వని

## జోగులు, పెళ్లిళ్లు, విడాకులు

జోగీజోగీ రాసుకుంటే బూడిద రాలిందని సామెత. ఇది అక్షరాలా నిజం; అందుచేతనే నిలకడగా ఉన్నది.

అయితే, జోగీ జోగీ పెళ్లి చేసుకుంటే, ఆ సన్నివేశం ఎలా ఉంటుందంటారు? పెళ్లి చేసుకున్న జోగులు విడాకు లిచ్చుకుంటే అది మరీ తమాషాగా ఉంటుంది కదూ? ఇలా విడాకు లిచ్చుకున్న జోగులు అంతకు పూర్వం వేర్వేరుగా మరొకళ్లకు విడాకు లిచ్చినవారైతే, అది రసభరితమైన ఒక నవలకు ఉత్తమ కథావస్తువు కాగల దనటం నిస్సందేహమే కదా?

అయితే, మన దేశంలో అదే పనిగా విడాకు లిచ్చుకొనటం అన్నది సాంఘిక జీవన రంగంలో తరుచు జరగదు. ఇది పశ్చిమ రాజ్యాలలోనే (ముఖ్యంగా అమెరికా లో) చాలా ఎక్కువ. మన సాంఘిక కట్టుబాట్లు అటువంటివి. అయితే, మనలో ఈ విడాకుల లక్షణం లేదని కాదు. వైవాహిక జీవితం విషయంలో దీనిని అణచి వేసుకుంటున్నాం. అంతే. తక్కిన రంగాలలో అంత మడి లేదు. అన్నిటికంటే ఏప్రాసి రంగం రాజకీయ రంగం. అందుచేతనే, రాజకీయ రంగంలో మానవ సహజమైన విడాకుల లక్షణం ఎక్కువగా కనిపిస్తున్నది.

ఈ పరమ సత్యాన్ని ఎవరైనా కాదంటే, డెమోక్రటిక్ పార్టీ వ్యవహారాన్ని ఉదహరిస్తే చాలు, వారు మళ్ళీ నోరెత్తరు. ఈ పార్టీ పుట్టుపూర్వోత్తరాలు, దీని తీరు తెన్నులు' పడుతున్న అవస్థలు అక్షరాలా అమెరికన్ వైవాహిక జీవితానికి రాజకీయ ప్రతిబింబంగా ఉన్నవనటం అతిశయోక్తి కాజాలదు.

సోషలిస్టు డెమోక్రటిక్ పార్టీ అవతరణ ఇద్దరు రాజకీయ జోగుల పరిణయం వంటిది. ఈ వివాహం ఉభయ పక్షాలు హృదయపూర్వకంగా చేసుకొన్నట్టిది కాదు, ఒకరికి బూడిద ఎక్కువ, మరొకరికి వాలుచూపులతత్వం ఎక్కువ. డెమోక్రటిక్ పక్షం అంతకుముందు కాంగ్రెస్‌లో పెత్తనం లభించలేదని దానికి విడాకు లిచ్చింది. సోషలిస్టు పక్షం లోహియాతో సంసారం చెయ్యలేక, ఆ మనిషితో వేగలేక, బయట పడింది. విడాకులిచ్చి ఉండటం అనేది తప్పించి వీరిద్దరి మధ్యా మరెట్టి ప్రేమానుబంధం లేదు. పైగా, డెమోక్రటిక్ పక్షం మనస్సు ఆదినుంచీ ఆశ్చర్యకరంగా గారిపై లగ్నమై ఉన్నది. డెమోక్రటిక్ పార్టీ అవతరణకు ముందు నేనీ విషయాన్ని బయటపెట్టగా, ఒక పాఠకురాలు ఆక్షేపణ తెలిపింది. ఆమెకు బహుశా ఇటువంటి వ్యవహారాలలో లోతుపాతులు తెలియవు. అప్పటికింకా రంగాగారు కాంగ్రెస్‌కు విడాకులివ్వక పోవటం వల్ల, పెక్కుమంది డెమోక్రటిక్ పార్టీకి, ఆయనకు సంబంధం ఉండదని అనుకొని ఉండవచ్చు. కాని ఎప్పుడైతే, ఆయన వృద్ధనారి కాంగ్రెస్‌తో తెగతెంపు చేసుకొన్నాడో పి. వి. జి. రాజు, చెన్నారెడ్డి వర్గాల బాంధవ్యం విచ్ఛిన్నం కాకతప్పదని, రంగాగారి స్వతంత్రపార్టీ అవతరించిన తర్వాత, ఇక చెన్నారెడ్డి వర్గం రోమియోను చూసిన జూలియట్ వలె ఉరుకులు వెయ్యక తప్పదని, వారిని పట్ట పగ్గాలుండవని అనాడే స్పష్టమైనది. భూకమతాలకు గరిష్ఠ పరిమితిని, సహకార సేద్య విధానాన్ని, ఆహార ధరలను తగ్గించటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పార్టీ అవతరించినప్పుడు, చెన్నారెడ్డిగారి వర్గాన్ని అందులో చేరకుండా అడ్డడం బ్రహ్మతరం కాదని వేరే చెప్పాలా? అయితే, ఈ లోగా తొందరపడి సోషలిస్టులతో పొత్తు పర్వరచుకొనటం మూలంగా, మనోభీష్టాన్ని నెరవేర్చుకొనటం కొంచెం కష్టసాధ్యమైనది. విడాకులకు ఏదో ఒక కారణం చూపించాలి కదా? లేకపోతే లోకులు విడాకులు మంజూరు చెయ్యరు. ప్రస్తుతం డెమోక్రటిక్ పక్షం వారు దీనికోసమే తాపత్రయ పడుతున్నారు. తెగించదలచుకొన్న వారికి సాకు దొరకకుండా ఉంటుందా? కొద్ది రోజులే ఈ ముసుగులో గుద్దులాట. ఈ కాపరం చెడటం తథ్యం. శ్రీ పి. వి. జి. రాజు గారు పెనకపడి ఎంతగా నెత్తీనోరూ బాదుకున్నా, ఎంతగా హృదయం చించుకొని ఆక్రోశించినా, ఎంత జాలిగా బ్రతిమాలుకున్నా డెమోక్రటిక్ పక్షం లేచిపోవటం తథ్యం. వ్యవహారాలు ముదిరి రచ్చకెక్కిన తర్వాత, ఇక విడాకులకు సమ్మతిస్తేనే మర్యాద దక్కుతుంది. ఎన్. డి. పి లోనిసోషలిస్టువర్గం ఎల్లాగో అల్లాగమనస్సుసరి పెట్టుకొనటంమంచిది.

సోషలిస్టు పక్షం తన రాజకీయ భాగస్వామి వియోగం వల్ల తటస్థించిన బ్రహ్మచర్యాన్ని భరించ లేకపోతే, మరొక తెరువు ఏదైనా చూసుకోవచ్చు. ఈ దేశంలో ఎందుచేతనో సోషలిస్టు నాయకులంతా అర్భకులు, అప్రయోజకులూ ఐపోయారు. స్థిరంగా ఉండేటట్టు చేసే రసికత్వం కాని, తదితర ప్రజ్ఞా విశేషాలు, ఆకర్షణలు కాని వారిలో మృగ్యం. అందుచేతనే ఎన్ని సార్లు సంసారాలు పెట్టినా, అన్ని సార్లూ అవి భగ్నమై పోతున్నాయి. ఇప్పటికే, చాలామంది సోషలిస్టులు ఎవరి తరుణోపాయం వారు చూసుకున్నారు. తల్లి తండ్రులు చూసిన వారిని మొదట్లో పెళ్లాడనని తర్వాత వివాహం చేసుకున్నట్టు, సోషలిస్టులలో పెక్కు మంది కాంగ్రెస్‌లో చేరారు. దీనికి ఇష్టపడని వారు ఎవరి పంచ చేరకుండా త్రిశంకు స్వర్గంలో ఉన్నారు. వారి పనే నయం. కనీసం వియోగ బాధ, విడాకుల చికాకు లేకుండా కొంత వరకు హాయిగా ఉన్నారు.

—"కూచిమంచి"

## ఐసెన్‌హోవర్, కృశ్చేవ్ చర్చలు ప్రారంభం

వాషింగ్టన్, సెప్టెంబర్ 15

సోవియట్ ప్రధాని కృశ్చేవ్, అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ నేడు రెండు గంటల సేపు వైట్ హౌస్ లో చర్చలు జరిపారు.

"స్నేహ పూర్వకంగా, నిర్మొగమాటం"గా చర్చలు జరిగాయి.

మాళీ లాండ్ మౌంటన్స్ లోని డేవిడ్ క్యాంప్ వద్ద సెప్టెంబర్ 25 వ తేదీ సాయంత్రం నుంచి 27 వ తేదీ మధ్యాహ్నం వరకు చర్చలు జరపటానికి ఉభయ దేశాల నాయకులు అంగీకరించారు.

నేడు జరిగిన చర్చలు మామూలు విషయాలపై జరిగాయని "వైట్ హౌస్" ప్రతినిధి శ్రీ జేమ్స్ హేగర్టీ విలేఖరులకు తెలియజేసారు.

సరిగా ఏయే విషయాలను చర్చించనదీ వెల్లడించటానికి శ్రీ హేగర్టీ నిరాకరించారు. ప్రారంభక సంభాషణలు జరిగాయని ఆయన అన్నారు.

సోవియట్ విదేశాంగ మంత్రి శ్రీ ఆండ్రీ గ్రోమికో, అమెరికా విదేశాంగ మంత్రి శ్రీ హెర్టర్ లేపు విదేశాంగ శాఖ కార్యాలయంలో కలుసుకొంటారని కూడా నేడు వెల్లడించబడినది.

కృశ్చేవ్, ఐసెన్‌హోవర్ నేడు ప్రప్రథమంగా సమావేశ మైనారు.

ముందు చర్చల విషయమై ఏ వర్గమైనా ఎజెండా పేర్కొనటం లేదని శ్రీ హేగర్టీ వెల్లడించారు.

### హెలికాప్టర్ ద్వారా నగర దృశ్యాల సందర్శన

వాషింగ్టన్, సెప్టెంబర్ 15

కృశ్చేవ్‌తో చర్చలు జరపటం ముగిసిన తర్వాత ఐసెన్ హోవర్ నేడు ఆయనను హెలికాప్టర్‌లో తీసుకొని వెళ్లి అమెరికా రాజధాని నగరమైన వాషింగ్‌టన్ దృశ్యాలన్నీ చూపించారు.

వైట్‌హౌస్ లాన్ పై నుంచి హెలికాప్టర్ ఎగిరి వెళ్తుండగా శ్రీ కృశ్చేవ్ కిటికీలో నుంచి తొంగిచూడటం ప్రారంభించారు. ఆయన చాలా హుషారుగా కనిపించారు.

30నిమిషాల తర్వాత హెలికాప్టర్ తిరిగి వచ్చిన వెంటనే కృశ్చేవ్ బ్లేర్ హౌస్ అతిథిగృహానికి తిరిగి వెళ్లారు.

అమెరికా, రష్యా రాజ్యాధినేతలు ఇలా కలిసి పర్యటన జరపటం ప్రపంచ చరిత్రలో ఇదే తొలిసారి.

### ఐసెన్‌హోవర్ విందు

రాత్రికి ఐసెన్‌హోవర్ కృశ్చేవ్ కుటుంబానికి విందు చేశారు. విందుకు కృశ్చేవ్ భార్య, కొడుకు, ఇద్దరు కూతుళ్లు, అల్లుడు కూడా వెళ్లారు. కృశ్చేవ్ వైట్ హౌస్‌కు వెళ్లటం ఇదే రోడ్డు నిర్మిస్తారు.

## ఐసెన్‌హోవర్ కృశ్చేవ్‌కు స్వాగతం చెప్పిన ఘట్టం

వాషింగ్టన్, సెప్టెంబర్ 16

సోవియట్ ప్రధాని కృశ్చేవ్ విమానంనుంచి దిగుతుండగా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ స్వాగతమిస్తున్న దృశ్యాన్ని చూడాలని కాచుకొన్న వేలాదిమందిలో కొద్దిమంది మాత్రమే ఆ ఘట్టాన్ని చూడగలిగారు.

శ్రీ కృశ్చేవ్ ఎక్కి వచ్చిన పెద్ద విమానంజనానికొద్దిదూరంలో ఆగినది. విమానం ఫలానా చోట ఆగుతుందని తలుపు దగ్గరగా ఉండాలని ఆశించిన పెక్కుమంది ఫొటోగ్రాఫర్లకు, టెలివిజన్ కెమెరామన్‌కు తీవ్ర ఆశాభంగం కలిగినది. అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ శ్రీ కృశ్చేవ్‌తో కరచాలనం చేస్తుండగా ఫొటోలు తీయాలనుకొన్నవారికి ఆశాభంగం కలిగినది. నాయకుల కౌగిళ్లు తప్పించి ఇంకేమీ కనిపించలేదు.

శ్రీ కృశ్చేవ్ విమానం నుంచి దిగిన వెంటనే "అధ్యక్షా! అమెరికా వచ్చినందుకు సుస్వాగతం" అని ఐసెన్‌హోవర్ అన్నారనీ, "మిమ్మల్ని కలుసుకోవటం చాలా సంతోషం" అని కృశ్చేవ్ సమాధాన మిచ్చారనీ శ్రీ జేమ్స్ హేగర్టీ విలేఖరులతో అన్నారు.

## చంద్ర గ్రహ యాత్ర అసంభవం కాదు

మాస్కో, సెప్టెంబర్ 14

మానవుడు చంద్ర మండలంలో అడుగుపెట్టడం కష్టమైన పనే అయినప్పటికీ, అసంభవం మట్టుకు కాదన్న సోవియట్ సైన్స్ అకాడమీ శాస్త్రజ్ఞుడు అలెగ్జాండర్ టాస్కీన్ నేడు ఇక్కడ విలేఖరుల గోష్ఠిలో అన్నారు.

అకాడమీ హాల్ విలేఖరులతో క్రిక్కిరిసి పోయినదనీ, గోష్ఠిని టెలివైజ్ చేసారనీ టాస్ వార్తా సంస్థ ప్రకటించినది.

రష్యా "లూనిక్" నిన్నటిదినం విజయవంతంగా చంద్రమండలం చేరుకొన్న సందర్భాన్ని పురస్కరించుకొని నేటి విలేఖరుల గోష్ఠి జరిగినది.

రాకెట్ విజయం వల్ల అనేక కొత్త విషయాలు తెలిసాయనీ, సాంకేతిక విషయాలన్నింటినీ శాస్త్రజ్ఞులు పరిశీలిస్తున్నారనీ ఆయన వెల్లడించారు. శాస్త్రజ్ఞుల పరిశీలన ఫలితం కోసం వేచిఉన్నామని ఆయన వెల్లడించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 16

పబ్లిక్ వర్క్స్ శాఖామంత్రి శ్రీ జె.వి. నరసింగరావు 1959 సెప్టెంబర్ 20వ తేదీన ఉదయం 6-30 గంటలకు కర్నూలు, అనంతపురం పర్యటనకు బైలుదేరుతారు. సెప్టెంబర్ 21వ తేదీ మధ్యాహ్నం 1-30 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

## లావోస్‌పై రష్యా ప్రతిపాదనకు అమెరికా తిరస్కృతి

వాషింగ్‌టన్, సెప్టెంబర్ 15

లావోస్ పరిస్థితిని పరిశీలించటానికి అంతర్జాతీయ సమావేశం ఒకటి ఏర్పరచాలని రష్యా చేసిన ప్రతిపాదనను అమెరికా త్రోసిపేసినది.

అలాటి సమావేశం ఏర్పరచినందువల్ల విభేదాలు మరింత పెరుగుతాయని విదేశాంగశాఖ నేడు రష్యా ప్రధాని నికిటా కృశ్చేవ్ ఇక్కడికి వచ్చిన కొద్ది సేపటి తర్వాత ఒక ప్రకటన చేసినది.

## బెంగాల్‌లో 959 మంది ఆహారోద్యమ ఖైదీల విడుదల

కలకత్తా, సెప్టెంబర్ 15

పశ్చిమ బెంగాల్ ఆహారోద్యమం సందర్భంగా అరెస్టయినవారిలో నిన్న 959 మందిని విడుదల చేసినట్లు బెంగాల్ పోలీస్ మంత్రి శ్రీ ముఖర్జీ పత్రికలవారికి నేడు తెలిపారు. విడుదలైన వారి పై సంఖ్యలో మిడ్నాపూర్, జల్పాల్‌గురి జిల్లాల సంఖ్య చేరలేదు.

ఇటీవలి ఆహారోద్యమం సందర్భంగా అరెస్టయిన 13 వేలమందిలో యింకా 3,400 మంది జైళ్ళలో వున్నారు.

## పరీక్షా విధానంలో మార్పులు
### ఢిల్లీ సమావేశంలో చర్చలు జరిగే సూచన

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15

స్కూలు ఫైనల్ పరీక్షలలో విద్యార్థులు యెక్కువగా తప్పిపోవటం నివారించే దెట్లా అనే విషయంతోపాటు పరీక్షా విధానాన్ని సంస్కరించ వలసిన తీరునుగూడా యీ నెల 21, 22 తేదీలలో ఇక్కడ జరుగనున్న సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు కార్యదర్శుల సమావేశంలో ప్రధానాంశాలుగా చర్చిస్తారని తెలుస్తున్నది. ఈ సమావేశాన్ని కేంద్ర విద్యామంత్రి శ్రీ కె. యల్. శ్రీమాలి ప్రారంభిస్తారు.

గత యెనిమిది సంవత్సరాలలో మెట్రిక్ పరీక్షలకు హాజరైన వారి సంఖ్య రెట్టింపు అయినట్లే, పరీక్షలలో తప్పినవారి సంఖ్య కూడా రెట్టింపుకు పెరిగింది. సగంమందికన్నా ప్యాసు కాకపోవటంలో మాత్రం మార్పు లేదు.

వివిధ రాష్ట్రాలలో మెట్రిక్ విద్యార్థులు అధిక సంఖ్యాకులుగా ప్యాసు కాకపోవటానికి అధికార వర్గాల దృష్టికి స్థూలంగా కనిపిస్తున్న కారణాలు ఇవి:

1. లాబొరేటరీ, లైబ్రరీ, మ్యాపులు మొదలగు పరికరాలు స్కూళ్లలో తగినంతగా లేకపోవటం.

2. క్లాసులలో విద్యార్థుల సంఖ్య పెరుగుదల (రద్దీ).

3. అనర్హులయిన, తగిన అర్హతలు లేని ఉపాధ్యాయుల నియామకం.

4. బోధనా కార్యక్రమ విధానము, పరీక్షా విధానాల మధ్య, సమన్వయలోపం.

5. ఇంగ్లీషు భాషలో జ్ఞాన లోపం.

6. ప్రయివేటు అభ్యర్థులు అధిక సంఖ్యలో పరీక్షలకు హాజరవటం.

7. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల విజ్ఞాన స్థాయిలో హెచ్చు తారతమ్యం.

8. అన్ని స్థాయిల విద్యార్థుల పరీక్షా పత్రాలను ఒకే విధంగా (దృష్టితో) సరిగా మార్కులు వేయటం.

పాఠ్య ప్రణాళికలోను, పరీక్షావిధానంలోను గమనీయమైనగొప్పమార్పులు తేవాలని అధికార వర్గాల ఆలోచన కాని విద్యా ప్రమాణాలు, స్థాయి యేమాత్రం తగ్గిపోకుండా, స్వల్పకాలిక విధానాల ద్వారా మార్పులను ప్రవేశపెట్టే మార్గములన్వేషించుట అవసరమని విద్యాశాఖ అధికార వర్గాలలో భావిస్తున్నారు.

## ఝువాంగ్‌సాన్ కోట తిరిగి తిరుగుబాటు దారుల కైవసం

లావోస్, సెప్టెంబర్ 14

లావోస్‌లోని శాంనువా రాష్ట్రంలో ఉత్తర వియత్నాం సరిహద్దు సమీపంలో ఉన్న ఝువాంగ్‌సాన్ కోట తిరిగి తిరుగుబాటుదారుల వశమైనట్లు నేడిక్కడ అధికార సైనిక వర్గాలద్వారా తెలిసినది.

ఈకోట గత జూలై మధ్యలో తొలిసారి తిరుగుబాటు దారుల వశమైంది. తర్వాత నాలుగుసార్లు చేతులు మారినది. గతవారమే లావోస్ సైన్యం దీనిని స్వాధీనపరచుకొన్నది. ఆనాటినుంచి తిరుగుబాటుదారులు కోటపై తీవ్రమైన దాడులు ప్రారంభించారు. అదనపు దళాలకోసం మూడు రోజుల క్రితం కోటనుంచి విజ్ఞప్తి వచ్చినది. ఇప్పుడు లావోస్ సేనలు ఆ కోటను వదిలేశాయి.

# ఐక్యరాజ్య సమితిలో చైనా సభ్యత్వం
## మరోసారి ఇండియా ప్రయత్నం

ఐక్యరాజ్యసమితి (న్యూయార్క్), సెప్టెంబర్ 16

కమ్యూనిస్టు చైనాను ఐక్యరాజ్య సమితి ప్రాతినిధ్యం ఇప్పించటానికిగాను భారత దేశం తిరిగి మరో ప్రయత్నం చేస్తున్నది. అయితే ఇండియా ప్రయత్నం సఫలమయ్యే సూచనలు కనిపించటం లేదు.

జనరల్ అసెంబ్లీ చర్చనీయాంశాలలో చైనా సభ్యత్వం సమస్యను కూడా చేర్చాలని ఇండియా చేసే సిఫార్సును సారధ్య సంఘం తిరస్కరించటం తథ్యమని వివిధ దేశాల ప్రతినిధి వర్గాలవారు భావిస్తున్నారు.

కోమింటాంగ్ చైనాను రద్దుచేసే టట్టుగాని, కమ్యూనిస్టు చైనాకు ప్రాతినిధ్యం లభించేటట్టుగాని చేయబడే ప్రతిపాదనలను త్రోసివేయాలని అమెరికా చేయనున్న ప్రతిపాదనను సారధ్య సంఘం ఆమోదించటం తథ్యమని కూడా పై వర్గాలవారు భావిస్తున్నారు.

చైనా, భారత దేశాల మధ్య సరిహద్దు సంఘటనలు జరిగినప్పటికీ, సిద్ధాంత రీత్యా భారతదేశం చైనా సభ్యత్వం విషయమై తన వైఖరిని మార్చుకోదని విశ్వసనీయంగా తెలుస్తున్నది. కమ్యూనిస్టు చైనా సమితిలో ప్రాతినిధ్యం అవసరమని భారతదేశం ఇంకా విశ్వసిస్తున్నది.

ప్రపంచ వ్యవహారాలపై జనరల్ అసెంబ్లీ చర్చలో సోవియట్ ప్రధాని కృశ్చేవ్ సుదీర్ఘోపన్యాసం చేసే రోజున సభను బహిష్కరించాలని కోమింటాంగ్ చైనా నిర్ణయించినది.

## మాక్‌మోహన్ రేఖను టిబెట్ ప్రభుత్వం అంగీకరించ లేదట

హాంకాంగ్, సెప్టెంబర్ 14

టిబెట్-భారత దేశాలమధ్య న్యాయవిరుద్ధమైన మాక్‌మోహన్ రేఖను టిబెట్ స్థానిక ప్రభుత్వం ఎన్నడూ గుర్తించలేదని టిబెటన్ కపాంగ్ (పూర్వపాలక మండలి) మాజీ సభ్యుడు ఒకరు అన్నట్టు నవచైనా వార్తా సంస్థ నేడు ప్రకటించినది.

పై సభ్యునిపేరు రోంపా టుటాన్ కుంచింగ్.

1913వ సంవత్సరంలో బ్రిటన్, చైనా, టిబెట్ ప్రతినిధులు జరిపిన సిమ్లా సమావేశం బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుట్ర అని ఆయన అన్నారట.

రహస్య లేఖలు వ్రాసుకొని టిబెటన్ బ్రిటిష్ ప్రతినిధులు రేఖను రూపొందించినట్టు ఆయన ప్రకటించారు. టిబెటన్ స్థానిక ప్రభుత్వం దానిని ఎన్నడూ అంగీకరించలేదు. టిబెటన్ ప్రతినిధి తనకు అధికారం లేని పనిచేసాడు. 1947వ సంవత్సరం బ్రిటిష్ హక్కులన్నీ తమకు సంక్రమించినట్టు, మాక్‌మోహన్ రేఖకు దక్షిణ భూభాగం తమదైనట్టు భారత ప్రభుత్వం లేఖ వ్రాసినది. అప్పుడే టిబెటన్ ప్రభుత్వం అందుకు ఆక్షేపణ తెలిసినది. ప్రధాని నెహ్రూకు ఇది బాగా జ్ఞాపకం ఉండే ఉంటుంది అని ఆయన అన్నారు.

## బ్రిటన్‌లో శ్రీ హెడా పర్యటన

హైదరాబాద్, సెప్టెంబర్ 15

కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా బ్రిటన్‌లో అక్టోబర్‌లో జరిగే పార్లమెంట్ యెన్నికల పరిశీలనకుగాను శ్రీ హరిశ్చంద్ర హెడా యిక్కడనుంచి 19వతేదీ బయలుదేరి వెళ్తున్నారు.

ఇటీవల ఢిల్లీలోని బ్రిటిష్ హైకమిషనర్ కాంగ్రెస్ అధ్యక్షురాలిని కోరగా కాంగ్రెస్ ప్రతినిధిగా వారు శ్రీ హెడాను ఎన్నుకొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ అతిథిగా ఆ దేశంలో ఇరువారాలు పర్యటించి, ఆక్కడ ఎలెక్షన్ కార్యక్రమం, ప్రచార సరళిని శ్రీ హెడా పరిశీలిస్తారు.

## మధ్య ప్రదేశ్ విభజనకు విజ్ఞప్తి

రాయపూర్, సెప్టెంబర్ 15

మధ్య ప్రదేశ్ రాష్ట్రాన్ని విభజించి, ఛాటిస్‌ఘర్, విదర్భప్రాంతాలతో ద్విభాషా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని మధ్యప్రదేశ్ అసెంబ్లీ ప్రజా సోషలిస్టు పక్షం నాయకుడు శ్రీ విశ్వనాథ యాదవ తమస్కార్, ఛాటిస్‌ఘర్ మహాసభ నాయకుడు డాక్టర్ ఖుబ్‌చంద్ బాఘెల్, శ్రీ బ్రిజలాల్ వర్మ నేడొక సంయుక్త ప్రకటనలో ప్రధాని శ్రీ నెహ్రూకు విజ్ఞప్తి చేసారు.

లండన్, సెప్టెంబర్ 15

రక్షణ ప్రయోజనాలకు ఇకఅవసరం లేని కారణంగా లక్ష టన్నుల రబ్బరును అమ్మదలచినట్టు బ్రిటిష్ ప్రభుత్వం నేడు ప్రకటించినది.

## నిఘంటువులపై కరాచీ పోలీసులదాడి

కరాచీ, సెప్టెంబర్ 15

కరాచీ పోలీసులు నిన్న నగరంలోని వివిధ పుస్తకాల దుకాణాలపై దాడి జరిపి 215 కాన్సైస్ ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ పత్రులను స్వాధీన పరచుకున్నారు.

ఈ డిక్షనరీ ప్రచురణ కర్తలైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ స్థానిక కార్యాలయంలో పోలీసులకు ఒకే ఒక ప్రతిలభించినది. అది స్టెనోగ్రాఫర్లు ఉపయోగించే ప్రతిదానిని తక్షణమే స

# ఎలెక్ట్రాలిటిక్ మాంగనీసు ఉత్పత్తి

## జాతీయ లోహ శాస్త్ర పరిశోధనాలయం ప్రక్రియ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16

జెమ్‌షెడ్పూర్‌లోని జాతీయ లోహ శాస్త్ర పరిశోధనాలయంలో నాసిరకం మాంగనీసు ఖనిజం నుంచి ఎలక్ట్రాలిటిక్ మాంగనీసును తయారు చేయడానికి ఒక ప్రక్రియ కనిపెట్టారు. ఈ ప్రక్రియ ద్వారా వ్యాపారరీత్యా ఎలక్ట్రాలిటిక్ మాంగనీసును ఎద్దు ఎత్తున ఉత్పత్తి చేయవచ్చును. దేశంలో ఈ రకం మాంగనీసు వాడకం కూడా ఇందువల్ల బాగా పెరిగే అవకాశాలున్నాయి. ఇండియాలో వున్నంత మాంగనీసు ఖనిజం మరే దేశంలోను లేదని చెప్పవచ్చును. ఈ ఖనిజం 15 కోట్ల టన్నుల దాకా భూగర్భంలో నిక్షిప్తం అయి ఉన్నట్లు అంచనా. ఇందులో 6 కోట్ల టన్నులు మేలు రకంది. తక్కినది నాసిరకంది. మేలిరకం ఖనిజంలో సాలీనా సుమారు 10 లక్షల టన్నులు ఎగుమతి చేయడమో లేక ఫెర్రో మాంగనీసు ఉత్పత్తికి వినియోగించడమో జరుగుతున్నది. పోతే నాసిరకం ఖనిజం ఎందుకూ కొరగాని తుక్కుక్రింద పారేస్తున్నారు. తక్కువ కర్బనం కలిసిన ఫెర్రో మాంగనీసుకంటే ఈ ఎలక్ట్రాలిటిక్ మాంగనీసు అనేక విధాల లాభకరమైంది. అందువల్ల ఎలెక్ట్రాలిటిక్ మాంగనీసు వాడకం ఇటీవల బాగా పెరుగుతోంది. విదేశాలలో ఎలెక్ట్రాలిటిక్ మాంగనీసును పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి, ఇనుము కలిపిన, ఇనుము కలియని మిశ్రమ లోహాల తయారీలో విరివిగా వాడుతున్నారు.

# పాల సప్లయి దారుల సమ్మె

బొంబాయి, సెప్టెంబర్ 15

నగర ప్రజలకు రోజుకు 2500 మణుగుల పాలు సప్లయి చేసే ఆరే పాల కేంద్రంలోని 165 మంది పాలవారు తమ పాలకు హెచ్చువర కావాలంటూ నేటి ఉదయం సమ్మెచేసి, పాల సప్లయి నిలిపేశారు. వీరు సప్లయిచేసే పాలను శుద్ధిచేసి, సీసాలకెక్కించి, నగర వాసులకు పాల సీసాలుసప్లయి చేస్తుండేవారు. ఈ సమ్మెవల్ల యీ ఉదయం పాలు సప్లయికాలేదు. మధ్యాహ్నానికి పిండిన పాలు, పిండిపాలు కలిపినవి ప్రజలకు సప్లయిచేయబడునని ప్రభుత్వం ప్రకటించింది.

# గ్రామ వైద్య పరీక్షా ఫలితాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15

1959 జూన్ నెలలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'గ్రామ వైద్య' పరీక్షలలో ఈ దిగువ వారు ఉత్తీర్ణులయినారు:

17, 19, 37, 41, 42, 45, 48, 50, 52, 53, 55, 56, 60, 67, 69, 74 నుంచి 81 వరకు.

# హిందీ వారోత్సవాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15

అక్టోబర్ 1 నుండి రాష్ట్రమంతటా హిందీ వారోత్సవములు జరుప వలసిందిగా దక్షిణ భారత హిందీ ప్రచారసభ ఆంధ్రశాఖ కార్యదర్శి శ్రీ వేమూరి ఆంజనేయశర్మ నేడొక పత్రికా ప్రకటన ద్వారా హిందీ ప్రేమిమండలులకు విజ్ఞప్తి చేశారు.

# నాగార్జున కళాశాలలో ప్రణాళికా సదస్సు

నల్లగొండ, సెప్టెంబర్ 12

స్థానిక నాగార్జున కళాశాలలో ప్రణాళికా సదస్సు యేర్పరచే సందర్భంలో జరిగిన బహిరంగ సభకు జిల్లా కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శ్రీ నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ శ్రీ కామేశ్వరరావు జాతీయ ప్రణాళికా వారోత్సవాలపై ప్రారంభోపన్యాసం, ప్రణాళికాత్మకంగా దేశంలో జరుగుతున్న సర్వతోముఖాభివృద్ధి కృషిని వివరించారు.

సభలో లెక్చరర్ పూర్ణచంద్రరావు, విద్యార్థులు యల్లారెడ్డి, శేషంరాజు, రామలింగం, జిల్లా పబ్లిసిటీ అసిస్టెంటు శ్రీ నరసింహారెడ్డి కూడా మాట్లాడారు.

# నార్సింగిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

హైదరాబాద్, సెప్టెంబర్ 14

రామాయంపేట బ్లాకులో, చెంగల్ నార్సింగ్ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర స్థాపనపై ఆ గ్రామ పంచాయతీ అధ్యక్షులు శ్రీ పి. రామిరెడ్డి అధ్యక్షతన నార్సింగ్ సర్కిల్‌లో పదివేల రూపాయలు వసూలు చేసి, డివాజిట్ చేశారు.

వీరి కృషికి గవ్వేలు నియోజక వర్గ శాసన సభ్యులు, తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులున్నైన శ్రీ ఆర్. నరసింహారెడ్డి మొదటి నుంచి తోడ్పడుతూ, వచ్చారు.

# దేశంలో అక్షరాస్యత నూరు శాతం పైగా పెరుగుదల

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16

భారత దేశంలో అక్షరాస్యత నూటికి నూరువంతులు పైగా పెరిగినదనీ, 1951 లో అక్షరాస్యుల శాతం నూటికి 16.6 వంతులు కాగా, ఇప్పుడు నూటికి 40.7 వంతులున్నదనీ, 1961 జనాభా లెక్కల సందర్భంలో తయారు చేసిన ప్రశ్నావళిని ముందుగా పరీక్షించే నిమిత్తం జరిపిన పరిమిత పరిశీలనలను బట్టి తేలింది.

అక్షరాస్యత పురుషులలో కంటే స్త్రీలలో ఎక్కువగా పెరిగింది. స్త్రీలలో అక్షరాస్యత 1951 లో నూటికి 7.9 వంతులు కాగా, ఇప్పుడు నూటికి 23.8 వంతులు. పురుషులలో అక్షరాస్యత కూడా హెచ్చుగానే ఉంది. అది 1951 లో నూటికి 24.9 వంతులు కాగా ఇప్పుడు నూటికి 51.7 వంతులకు పెరిగింది.

ఆర్జన పరుల సంఖ్య మాత్రం నూటికి 4 వంతులు తగ్గి, నూటికి 39.9 నుంచి 36 వంతులకు దిగింది. 1951 జనాభా లెక్కల ప్రకారం స్వయం పోషకులైన వారి యొక్క, వారి మీద ఆధారపడివున్న ఆర్జన పరుల యొక్క శాతం గ్రామ ప్రాంతాలలో నూటికి 41 వంతులు, నగర ప్రాంతాలలో నూటికి 34.7 వంతులుగా వున్నది. ఈ పరిశీలనకు ముందు కార్మికుల యొక్క, ఆర్జనగల కార్మికుల యొక్క శాతం గ్రామ ప్రాంతాలలో నూటికి 29.9 వంతులూ, నగర ప్రాంతాలలో నూటికి 29.6 వంతులూ వున్నది.

ఈ పరిశీలనలు ప్రముఖ నగరాలైన బొంబాయి, కలకత్తా, ఢిల్లీ, మద్రాసులతో సహా అన్ని నగరాలలోనూ జరిగింది.

# ప్రభుత్వ రంగంలో నూనె వ్యాపారం

## చురుకుగా సన్నాహాలు

బొంబాయి, సెప్టెంబర్ 15

ప్రభుత్వ రంగంలో పెట్రోలియం వ్యాపారం సాగించటానికి ఇటీవలె కొత్తగా రిజిస్టర్ చేయబడిన కంపెనీ కేంద్ర కార్యాలయాన్ని బొంబాయిలో నెలకొల్పటానికి సన్నాహాలు చురుకుగా సాగుతున్నాయని నేడిక్కడ అభిజ్ఞ వర్గాల ద్వారా తెలిసినది.

కేంద్ర నూనె, గనులు, ఇంధన మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారి ఒకరు ఇటీవలె వగరానికి వచ్చి వెళ్లారు.

12 కోట్ల గుర్తించబడిన పెట్టుబడితో, ఇండియన్ ఆయిల్ కంపెనీ అనే పేర రిజిస్టర్ చేయబడిన ఈ సంస్థ నూనె పరిశ్రమలో ప్రభుత్వ రంగం వేసిన మరో ముందడుగనటానికి నిదర్శనం.

ఈ కొత్త కంపెనీ ఏర్పాటు అయినంత మాత్రాన ప్రైవేట్ రంగంలో పని చేస్తున్న నూనె కంపెనీలలో కాని, ఏజెన్సీలలో కాని తొక్కిసలాట చేసుకొనటం జరగదని తెలుస్తున్నది. ఆరంభదశలో ఈ కంపెనీ అత్యధిక పెట్రోలియం వినియోగదారైన ప్రభుత్వానికి అవసరమైన పెట్రోలియంను సరఫరా చేయటానికి మాత్రం పూనుకొంటుంది. ప్రస్తుత సూచనలనుబట్టి కాలక్రమేణా ప్రభుత్వ రంగంలో నూనె పంపిణీ వ్యాపారాన్ని విస్తరించాలని ప్రభుత్వం తలపెట్టినట్టు తెలుస్తున్నది. ఈ లోగా ఈ కొత్త కంపెనీ ప్రభుత్వ రంగంలో నూనె పంపిణీకి పథకాలను రూపొందిస్తుంది.

# జంట నగరాల దుకాణాల పని వేళలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15

హైదరాబాద్ గుమాస్తా సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ పెండెంవాసుదేవ్ ఇలా వ్రాస్తున్నారు: "జంట నగరాలలో చాలా మంది ఘుకాణాల వారు తమ అంగళ్ళను అర్ధ రాత్రి వరకు తెరచి యుంచుతున్నారు. దీనివల్ల గుస్తాలు, ఆరోగ్యాన్ని గూడా గమనించక ఎక్కువ గంటలు పని చేయవలసి వస్తున్నది. లేబరు డిపార్టుమెంటు వారు ఈ విషయం గమనించి, గుమాస్తాల కష్టం తొలగించాలని మనవి చేస్తున్నాను"

# కె. ఇ. ఎం. ఆస్పత్రి సిబ్బంది కోర్కెలు

## బైఠాయింపు సమ్మెకు సంకల్పం

హైదరాబాద్, సెప్టెంబర్ 16

సెప్టెంబర్ 21 లోగా తమకోర్కెలు యీడేర్చకపోతే, సికింద్రాబాద్ కె. ఇ. యం. ఆసుపత్రి సిబ్బందివారు ఆ తేదీన బైఠాయింపు సమ్మె చేయదలచినట్లు ప్రభుత్వ ఆరోగ్య, వైద్యశాఖ కార్యదర్శికి నోటీసు పంపారు.

వారు పంపిన లేఖలో, తి. ఒ. ప్రకారం తమకు లభించవలసిన వారం వారం సెలవు, నిర్ణీత గంటలపని, క్యాజుయల్ లీవు వగైరా సౌకర్యాలు యేర్పర్చాలని కోరారు.

# జి.టి. ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌కు ప్రమాదం

బొంబాయి, సెప్టెంబర్ 15

శనివారం 12వ తేదీ సాయంత్రం ఢిల్లీలో బయలు దేరిన గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్ సెంట్రల్ రైల్వే భూస్వాల్ డివిజన్‌లోని మూర్తిజాపూర్ వద్ద పట్టాలు తప్పిందని ఈ రోజు ఉదయం ఇక్కడ తెలిసినది. జి. టి. ఎక్స్‌ప్రెస్ భూస్వాల్ నుంచి వాడీ, సికింద్రాబాద్‌ల మీదుగా మద్రాసుకు నడిపించబడుతున్నది.

మూడు రోజుల క్రితంబయలు దేరిన యీ జి. టి. ఎక్స్‌ప్రెస్ ఇంకా మార్గ మధ్యంలోనే వుంది. ఢిల్లీనుంచి నాగపూర్ వరకు సరిగ్గానే వచ్చింది. సికింద్రాబాద్ సెక్షన్‌లో ప్రవేశించేసరికి అవరోధాలేర్పడ్డాయి. బల్లార్షా వద్ద రైల్వేలైను నీటిలో మునిగిపోయినందున, వార్ధా నుంచి, రాయ్‌చూరు-వాల్తేరుల మీదుగా పంపాలని తీర్మానించే సరికి, యింతలో రాజమండ్రివద్ద గోదావరి వరద ప్రమాదస్థితి తెలియవచ్చి, యీ జి. టి. ఎక్స్‌ప్రెస్‌ను విట్టచివరసారిగా సికింద్రాబాద్ సెక్షన్‌లోని యీ మార్గం మీదుగా మళ్ళించే సరికి, బడనేర-మూర్తిజాపూర్‌ల మధ్య ఇంజన్ పట్టాలు తప్పింది. ఇంజన్ తిరిగి పట్టా పట్టించిన తర్వాత, ఈ రోజు వుదయం తిరిగి రైలు ప్రయాణం సాగించింది. దీనివల్ల ఆదివారం నాడు ఢిల్లీలో బయలు దేరిన ఎక్స్‌ప్రెస్, బొంబాయి-నాగపూర్ ఎక్స్‌ప్రెస్, బొంబాయి-హౌరా మధ్య నాగపూర్ మీదుగా నడిచే మెయిల్ నిలచిపోయినాయి.

ఈ లైను మీద మామూలు ప్రయాణాలు ఈ మధ్యాహ్నానికిసాధ్యమయింది.

# భొంబాయి విభజన సమస్య

## ఇందూలాల్ యాజ్ఞిక్ విజ్ఞప్తి

అహమ్మదాబాద్, సెప్టెంబర్ 15

బొంబాయి ద్విభాషా రాష్ట్రాన్ని, ప్రతి పక్షాలతో సంప్రతించకుండా విభజించరాదని మహా గుజరాత్ జనతా పరిషత్ అధ్యక్షుడు శ్రీ ఇందూలాల్ యాజ్ఞిక్ నేడు ఇక్కడ విలేఖరుల గోష్ఠిలో హెచ్చరించారు. వివిధ విషయాలపై ఎప్పటికీ విభేదాలు, ఆందోళన కొనసాగకుండా అన్ని పక్షాలను సంప్రతించి విభజన విషయంలో చర్య తీసుకోవటం అవసరమని ఆయన అన్నారు.

బొంబాయి రాష్ట్రంలో కాంగ్రెస్ వైఖరి చూస్తే రాష్ట్ర విభజన సమస్య పార్టీ వ్యవహారంగా రసికిస్తున్నదని ఆయన ఆక్షేపించారు.

# మెక్సికో స్వాతంత్ర్య దినోత్సవం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15

మెక్సికో స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, ప్రధాని నెహ్రూ అభినందన సందేశాలు పంపారు.

# నారాయణపేటకు విద్యుచ్ఛక్తి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 15

జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటరత్నం నిన్న నారాయణపేట ఫ్లోమ్ లైట్లు వెలిగించే మిట్ట కొక్కుతూ, ఏ దేశ భాగ్యమైనా తెలుగులో పాలంచే ఆదేశంలో విద్యుచ్ఛక్తి వుత్పత్తి, వినియోగాలు తెలిస్తే చాలునన్నారు. ఈ సందర్భంలో జరిగిన సభలో మాట్లాడుతూ రాజోలిబండ, సరళా సాగర్, కోయిల సాగర్ ప్రాజెక్టులవల్ల గ్రామాలు సౌభాగ్యవంతం కాగలవని వారు ఆశించారు.

# సుందర్‌నగర్‌లో దళిత జాతీయ సంఘం

హైదరాబాద్, సెప్టెంబర్ 16

నిన్న సాయంత్రం కాచీగూడలోని సుందర్‌నగర్ (అంబర్‌పేట రోడ్డు)లో హైదరాబాద్ దళిత జాతీయ సంఘ శాఖా కార్యాలయాన్ని శ్రీ బి. బలరాం ప్రారంభించారు. స్థానిక యూనిట్‌కు శ్రీ మల్లేశం అధ్యక్షులుగాను, శ్రీ ఎం. వీరయ్య ఉపాధ్యక్షులుగాను, కె. శాయిలు, పోలయ్య గారలు సంయుక్త కార్యదర్శులుగాను ఎన్నిక యయ్యారు.

# రాజధాని వార్తలు

భారతయాత్రగాంధ్ర సంఘానికి శ్రీ జిలానీ మరో రెండు సంవత్సరాలపాటు సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయినారు. కలకత్తాలో ఇటీవల జరిగిన ఈ గాంధ్ర జాతీయ సంఘ సమావేశాలలో పాల్గొని వీరు సోమవారంనాడు హైదరాబాద్ వచ్చారు.

* * *

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 10

దేవరకద్ర బ్లాకుకు చెందిన పేరూరు గ్రామంలోని పెద్దరైతు శ్రీ యాలాల బసప్ప (వయస్సు 70 సం॥ లు) ఆ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యేర్పాటు చేయుటకుగాను రెండు ఎకరాల భూమిని దానం చేశారు. జిల్లా ఆఫీసర్, జిల్లా ఆరోగ్య శాఖాధికారులు శ్రీ బసప్పను అభినందించారు.

* * *

సుల్తాన్‌బజార్‌లోని గవర్నమెంటు హైస్కూలులో సోమవారం నాడు విద్యార్థుల స్వయం పరిపాలనా దినం జరిగింది. విద్యాశాఖ రీజియనల్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ మీర్జా మహమ్మదాలిబేగ్ పాఠశాలను సందర్శించి తరగతులు నడుపుతున్న పిల్ల పంతుళ్ళ నభినందించారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 15

దేశోద్ధారక సమితి వారి ఆధ్వర్యాన 19 వ తేదీ సాయంత్రం బూరుగుమహాదేవ్ హాలులో టాల్‌స్టాయ్ 131 వ జయంత్యుత్సవ సభ శ్రీ తాపీ ధర్మారావు అధ్యక్షతన జరిగింది.

# ఆకాశవాణి

శుక్రవారం, సెప్టెంబర్ 18, 1959

## హైదరాబాద్ [ఎ]

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్ (గ్రా.రి) 6-35 కార్యక్రమ వివరణ 6-40 భక్తి రంజని 7-00 తెలుగులో వార్తలు 7-15 డి. సరోజ 7-40 గాంధీ చర్చ 8-00 ఆంగ్లమున వార్తలు 8-15 హిందీలో వార్తలు 8-30 గ్యానీ, బృందం 8-45 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం 1-00 స్త్రీల కార్యక్రమము 1-30 గీత్, భజన్ 1-50 తెలుగులో వార్తలు 2-00 వీణ 2-10 ఉర్దూలో వార్తలు 2-20 మాధ్యమిక పాఠశాలలకు 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి 3-45 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు 4-15 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 సాహిత్య సంచిక 6-45 గ్యానీ, బృందం 7-00 తెలుగులో వార్తలు 7-15 గాంధీ చర్చ 7-30 కర్ణాటక సంగీత కచేరి 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 ఉర్దూలో వార్తలు 9-30 తుది వజ్రం 9-45 భక్తాంజే 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

## బి

42.02 మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎ వలె 8-45 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైదరాబాద్ ఎ వలె 1-00 ఎ.ఎస్. శ్రీనివాసన్: వేణువు 1-30 హైదరాబాద్ ఎ వలె 2-10 వీణ: నిలయ విద్వాంసుడు 2-20 డి. సరోజ 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి. 3-45 హైదరాబాద్ ఎ వలె 4-15 ప్రసార సమాప్తి.

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎ వలె 6-15 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 హైదరాబాద్ ఎ వలె 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 భక్తిసుధాకరం 9-30 హైదరాబాద్ ఎ వలె 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

## విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాతము 6-40 భక్తి రంజని 7-00 తెలుగులో వార్తలు 7-15 డి. సరోజ 7-40 గాంధీ చర్చ 8-00 ఆంగ్లములో వార్తలు 8-15 హిందీలో వార్తలు 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము 1-00 మంచిరాజు సత్యనారాయణమూర్తి 1-30 క్లారినెట్, వేణువు 1-50 తెలుగులో వార్తలు 2-00 ప్రసార సమాప్తి. 3-30 శ్రోతలు కోరిన పాటలు 3-45 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు 4-15 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తెలుగులో వార్తలు 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 సంగీత కచేరి 9-00 ఆంగ్లమున వార్తలు 9-15 లలితసంగీతం 9-30 తుది వజ్రం 9-45 మంచిరాజు సత్యనారాయణమూర్తి 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

# నీరు తోడడానికి గాలి మరలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15

వాయు శక్తిని సద్వినియోగపరుచుకునే విషయమై వైజ్ఞానిక పారిశ్రామిక పరిశోధనా మండలి అధ్వర్యాన పరిశోధనలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో మంచి నీటిని సరఫరా చేయడానికీ, పన్న యెత్తున సేద్యం చేయడానికీ వీలుగా నీటిని తోడే రెండు తేలికరకాల గాలి మరలను మండలి రూపొందించినది. దేశవాళీ వస్తువులతో 200 లేక 250 గాలి మరలను తయారు చేయించి దేశంలోని వివిధ ప్రాంతాలలో వాటిని ప్రయోగాత్మకంగా నెలకొల్పాలని మండలి సంకల్పించినది. అధికారవోత్పత్తి నిబంధనల క్రింద నీరు తోడే పరికరాలకు గాను రుణాలు, ధన సహాయము మంజూరు చేస్తారు: గాలి మరలకు కూడా సహాయం లభిస్తుంది.

# శాన్ ఫ్రాన్సిస్కో చలన చిత్రోత్సవానికి భారతీయ చిత్రాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15

శాన్ ఫ్రాన్సిస్కోలో నవంబర్ 11 నుంచి 24 వరకు జరిగే మూడవ వార్షిక అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ప్రదర్శనార్థం నాలుగు భారతీయ చిత్రాలను పంపారు. కథా చిత్రాలలో రాజ్‌కపూర్ నిర్మించిన జాగ్తేరహో (హిందీ), సత్యజిత్ రాయ్ నిర్మించిన అపూర్ సంసార్ (బెంగాలీ), డాక్యుమెంటరీ చిత్రాలలో శాజ్ మహల్, కళాత్మక చిత్రాలలో రాధా కృష్ణన్ ఎన్నిక చేశారు. చివరి రెండు చిత్రాలను భారత ప్రభుత్వం తాలూకు ఫిల్ము శాఖవారు నిర్మించారు.

ఈ ఉత్సవంలో వివిధ తరగతులలోని ఉత్తమ చిత్రాలకు 11 గోల్డెన్ గేట్ అవార్డులు బహూకరించబడతాయి. వీటిలో 6 బహుమతులు హ్రస్వ చిత్రాలకు, 5 కథా చిత్రాలకు ఉద్దేశించబడ్డాయి. ఉత్తమ చలన చిత్రం, డైరెక్టరు, ఉత్తమమైన నటి, ఉపనటి, ఉత్తమ నటుడు, ఉప నటుడు, స్క్రిప్టు వగైరాకు ఐదు బహుమతులిస్తారు.

నిరుడు జరిగిన శాన్ ఫ్రాన్సిస్కో చలన చిత్రోత్సవంలో అపరాజిత అనే చిత్రానికి దర్శకత్వం నిర్వహించినందుకు శ్రీ సత్యజిత్ రాయ్‌కి బహుమతి యిచ్చారు.

1957 లో కార్లోవీవేరీ-జెకోస్లోవాకియాలో జరిగిన అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో జాగ్తేరహోకు, గ్రేట్ గ్రాండ్ ప్రిక్స్-ప్రప్రథమ బహుమతి - లభించింది.

# ఉత్తమ కథానికకు నవ్యసాహితీ సమితి బహుమానం

హైదరాబాద్, సెప్టెంబర్ 16

"భారతి"లో ప్రచురించిన "అపరాజిత" అనే కథ వ్రాసిన శ్రీ రంగారావుకు నవ్యసాహితీ సమితివారు 116 రూపాయలు బహుమానం సమర్పించారు.

యేటేటా వివిధ తెలుగు-పత్రికలలో ప్రచురితమైన కథానికలలో ఉత్తమమైనదానికి 116 రూపాయల బహుమానం ఇవ్వాలని నవ్యసాహితీ సమితి కడవరలో నిర్ణయించినది.

నవ్యసాహితీ సమితి కోరికపై క్రియుతులు కురుగంటి సత్యనారాయణ, దేవులపల్లి రామానుజరావు, శ్రీ టి. గోపీచంద్ 16 తెలుగు పత్రికలలో ప్రచురితమైన దాదాపు 1500 కథలను పరిశీలించి, వాటిలోకెల్లా "అపరాజిత" ఉత్తమమైనదని నిర్ణయించారు.

# నర్మదా నదికి పరదలు

అహమ్మదాబాద్, సెప్టెంబర్ 15

నర్మదానది ఒడ్డులపైనవున్న అనేక గ్రామాలు జలమయమైనాయి. ఆ గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు అధికార వర్గాల ద్వారా తెలిసినది.

# ధరవరలు

## కొత్తూరు సీతయ్య గుప్త దుకాణం

బుధవారం, 16-9-1959

ఉస్మాన్‌గంజ్, హైదరాబాద్, ఆం. ప్ర.

| | | |
|---|---|---|
| సన్న బియ్యము | 71-8-0 | 78-0-0 |
| దొడ్డు బియ్యము | 63-8-0 | 65-8-0 |
| అక్కులు ,, | 64-8-0 | 66-0-0 |
| 19 నెం. బి॥ | 65-0-0 | — |
| తెల్ల జొన్నలు | 48-8-0 | 51-4-0 |
| చట్టి ,, | 42-8-0 | 43-0-0 |
| పసుపు | 92-0-0 | 98-0-0 |
| కందులు | 61-0-0 | 66-0-0 |
| ఎర్ర కందులు చి॥ | 49-8-0 | 50-14-0 |
| పెసలు | 47-12-0 | 51-0-0 |
| మినుములు | 50-0-0 | 52-12-0 |
| శనగలు | 42-4-0 | 43-0-0 |
| ఉలవలు | 35-8-0 | 36-0-0 |
| వెల్లము | 65-0-0 | 85-0-0 |
| మిర్చి | 200-0-0 | 313-0-0 |
| చింతపండు | 120-0-0 | 170-0-0 |
| ఉల్లిగడ్డ కొ॥ | 11-0-0 | 14-0-0 |
| ఉల్లిగడ్డ పా॥ | 21-0-0 | 23-8-0 |
| గోధుమలు | 83-0-0 | 86-0-0 |
| కుసుమలు | 55-0-0 | 52-0-0 |
| నువ్వులు | 90-0-0 | 100-0-0 |
| ఇలాతిపలుకు చి॥ | చక్కి 64-8-0 | — |
| ఇలాతిపలుకు పె॥ | 94-0-0 | 96-0-0 |
| ఆముదాలు | 62-4-0 | — |
| పత్తిగింజలు | 37-0-0 | 43-0-0 |
| నూనె | 17-10-0 | 17-13-0 |
| కందిపప్పు పె॥ | 84-0-0 | 89-0-0 |
| కందిపప్పు చి॥ | 75-0-0 | 80-0-0 |
| మినప పప్పు | 73-0-0 | 74-4-0 |
| పెసర పప్పు | 73-0-0 | 76-0-0 |
| శనగ పప్పు | 52-8-0 | 53-0-0 |
| సిరిశనగ పప్పు | 60-0-0 | 75-0-0 |
| లంకపప్పు | 52-0-0 | 56-0-0 |
| ధనియాలు | 120-0-0 | 142-8-0 |
| ఇలాతికాయ | 32-0-0 | 35-0-0 |

బేతరకొండ, సెప్టెంబర్ 7

బేతరకొండ పట్టణంలోని కుట్టు పని వారల సహకార సంఘం ప్రథమ వార్షికోత్సవం నేటి సాయంత్రం అధ్యక్షులు శ్రీ కొండలరావు అధ్యక్షతన జరిగింది. ఈ సంఘానికి రెండువేలు పైగా పేరు ధనం వుంది.

# కేంద్ర కార్మిక సంస్థల సభ్యత్వ వివరాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15

ఐ. ఎన్. టి. యు. సి., ఎ. ఐ. టి. యు. సి., హెచ్. యం. యస్. ల యొక్క 1959 మార్చి 31వ తేదీ నాటి సభ్యత్వపు వివరాలు ప్రభుత్వానికి చేరాయి. అవి ఈ విధంగా ఉన్నాయి:

ఐ. ఎన్. టి. యు. సి: అనుబంధ సంస్థలు 1299, సభ్యుల సంఖ్య 15,03,605.

ఎ. ఐ. టి. యు. సి: అనుబంధ సంస్థలు 1338, సభ్యుల సంఖ్య 10,82,572.

హెచ్. యం. యస్: అనుబంధ సంస్థలు 324, సభ్యుల సంఖ్య 4,80,290.

యు. టి. యు. సి. తమ సభ్యత్వపు వివరాలను తెలుపడానికి 1959 సెప్టెంబర్ 15వ తేదీవరకూ గడువు కోరారు. అందుకు అంగీకరించడం జరిగింది. ఈ సంస్థలు వెల్లడించిన సభ్యత్వపు అంకెలను తనిఖీ చేయడానికి 1958 మే నెలలో నైనిటాల్‌లో జరిగిన భారత కార్మిక మహాసభలోనూ, 1959 మార్చి 21 న న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంస్థల సమావేశంలోనూ నిర్ణయించిన విధానం అనుసరించబడుతున్నది. ఆ అంకెలను తనిఖీ చేయడానికి కొన్ని నెలలు పడుతుంది. కనుక 1960 ఏప్రిల్ నాటికి కచ్చితమైన అంకెలు ప్రకటించటం సాధ్యం కాగలదు.

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 14

భారత కమ్యూనిస్టుపార్టీ వచ్చే 21వ తేదీనుంచి 25వ తేదీవరకు కలకత్తాలో సమావేశాలు జరుపుతుంది.


## హిందీ పట్టు ప్రదానం

మద్రాస్, సెప్టెంబర్ 16

దక్షిణ భారత హిందీ ప్రచారసభ వారు ప్రవీణ, విశారద డిగ్రీలకు 1958 ఆగస్టు, 1959 ఫిబ్రవరి మాసాల్లో జరిపిన పరీక్షలలో ఉత్తీర్ణులయిన వారికి పట్టు ప్రదానం యీ 20వ తేదీ మద్రాసులో చేస్తున్నారు. కేంద్ర ఆహార మంత్రి శ్రీ పాటిల్ యీ కాన్వకేషన్‌లో ఉపన్యసిస్తారు.

శ్రీవత్స్ వారి
కెమొడెమ్
నొప్పులకు, వాపులకు
ఉపయోగకరమైన
అంజనము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
(ప్రైవేటు) లిమిటెడ్ మదరాసు

రు. 6/- కు వాచీ

16 జ్యూయల్స్ రిస్టు వాచీ 5 ఏండ్ల గ్యారంటీతో రు. 6-కు మా చెయిన్ సిస్టమ్ స్కీంక్రిందదొరుకును. పోస్టేజి అదనం. మా కామినీ సెంటును ప్రచారం చేయడానికి ఈ స్కీము ప్రవేశ పెట్టబడినది. పూర్తి సంతృప్తి కలుగును. లేనిచో సొమ్ము వాపసు. నేడే వ్రాయండి:
London Commercial Co
P. B. 2 (W-55) Amritsar.

10 వ దిగ్విజయ సంయుక్త వారం!
రాజ్యం పిక్చర్స్ వారి
కృష్ణ లీలలు
నటీనటులు: రంగారావు, రేలంగి, గుమ్మడి, లక్ష్మీరాజ్యం, సంధ్య, సూర్యకాంతం, రీటా, బేబీ ఉమ.
ప్యాలెస్ హైదరాబాద్ — రాజేశ్వర్ సికిందరాబాద్ — రామా వరంగల్
ఆటల సమయాలు: 6-00, 9-30
(Trupix) — నవయుగ రిలీజ్ —

4వ దిగ్విజయ సంయుక్త వారం!
రాజశ్రీ ప్రొడక్షన్స్ వారి
శభాష్ రాముడు

ఎన్. టి. రామారావు, గిరిజ, గుమ్మడి, రమణమూర్తి, కాంతారావు, దేవిక, మాలిని, రేలంగి, ఆర్. నాగేశ్వరరావు.
సాగర్ హైదరాబాద్ — అలంకార్ సికిందరాబాద్
నేడు 2 ఆటలు: 6-00, 9-30.
మార్కండేయ వరంగల్ — రమేష్ నిజామాబాద్
(Nima) — రాజశ్రీ రిలీజ్ —

నేడే చూడండి! నేడే చూడండి!!
పద్మినీ పిక్చర్స్ వారి
వీరపాండ్య కట్టబ్రహ్మన
(గేవాకలర్ తెలుగు చిత్రం)

శివాజీగణేశన్, పద్మిని, రాగిణి
నిర్మాత, దర్శకుడు: బి. ఆర్. పంతులు — సంగీతం: వెంకటాచారి
కమల్-హైదరాబాద్ — అజంతా-సికిందరాబాద్
ఆటలు: 2-30, 6-00, 9-30 — ఆటలు: 6-00, 9-30.
(Turpix) — తర్వాత చిత్రం రామా-వరంగల్ — శ్రీ సినీ కార్పొ

## సుందరయ్య విమర్శ శోచనీయం

(1 వ పేజీ తరువాయి)

వేతనాల కమిటీ చేయ వలసిన పనిలో చాలా భాగం పూర్తయింది గనక అలాంటి సమయంలో రాజీనామా అంగీకరించటం తప్పు ఇంకో మార్గం ఏముందో తమకు అర్థం కావటం లేదని ఆర్థిక మంత్రి అన్నారు.

వేతనాల కమిటీలో శ్రీ సుందరయ్యకు బదులు మరొకరిని నియమించే విషయాన్ని గురించి ప్రస్తావిస్తూ, శ్రీ సుందరయ్య రాజీనామా ఇచ్చిన సమయానికి కమిటీ తన నివేదిక రెండవ భాగం పరిశీలనను దాదాపు పూర్తి చేసిందని, కొన్ని తాత్కాలిక ప్రతిపాదనలు కూడా సంపాదించబడినాయని, అలాంటి సమయంలో కమిటీలో మరొక్కొత్త సభ్యుని నియమించినందువల్ల ప్రయోజనం ఉండదనే ఉద్దేశంతోనే శ్రీ వి. వి. రాజు రాజీనామా ఇచ్చినప్పుడు కూడా మరో సభ్యుని నియమించటం జరగలేదని ఆర్థిక మంత్రి స్పష్టీకరించారు.

ఈ సందర్భంలో ఆర్థిక మంత్రి శ్రీ సుందరయ్య వెళ్లి పోయిన తర్వాత ప్రభుత్వం వివిధ వేతనాల స్కేళ్ళను ఉద్యోగులకు అనుకూలంగా సవరించినదని, అది చూచినప్పుడే ఆయనకే ఆశ్చర్యం కలుగ వచ్చునని వెల్లడించారు.

వేతనాల కమిటీ నివేదికలోని అవకతవకలను తొలగించటానికి బదులు ప్రభుత్వం ఉన్న తాధికారుల జీతాలు హెచ్చించినదని సుందరయ్య చేసిన ఆరోపణను ఆర్థిక మంత్రి ఖండించారు. శ్రీ సుందరయ్య దృష్టిలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ళు, ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సెక్రెటరియట్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లు ఉన్న తాధికారులే మైనన్నారు, శ్రీ సుందరయ్య పేర్కొన్న ఉద్యోగులలో ఒక అసిస్టెంట్ సెక్రెటరీలను మాత్రమే ఉన్నతోద్యోగులుగా భావించ వలసినవారని, వారి విషయంలో సిఫార్సులు చేసే అధికారం కమిటీకి లేదు గనుక, కమిటీ ఎక్స్ పార్టీగా తన నిర్ణయాలు గైకొన్నది గనుక వారి వేతనాలను యథాతథంగా ఉంచాలనే విషయం పరిశీలనలో ఉన్నదని ఆర్థిక మంత్రి తెలిపారు.

నివేదిక మొదటి భాగంపై పరిశీలన జరుపుతున్నప్పుడు చర్చలన్నీ రహస్యంగా ఉండాలని కోరినప్పటికీ శ్రీ సుందరయ్య తాము తమ పార్టీతో సంప్రదించక తప్పదని చెప్పటం, కమిటీలో ఆయన నియామకం పార్టీ ప్రాతిపదికపై జరగనప్పటికీ అందుకు తాము అంగీకరించటం జరిగిందని ఆర్థిక మంత్రి జ్ఞాపకం చేశారు. ఆ తర్వాత జరిగిన చర్చలలో ప్రతి నిఫార్సు తమకు సంతృప్తి కల్గించినదని శ్రీ సుందరయ్య అనేక సార్లు చెప్పారని, ఆఖరుకు తమ ఇష్ట పూర్వకంగానే నివేదికపై సంతకం చేశారని, కమిటీ ఏకగ్రీవ నివేదిక సమర్పించినందున ప్రభుత్వం దానిని వెంటనే అంగీకరించినదని బ్రహ్మానందరెడ్డి అన్నారు.

ఆర్థిక మంత్రి లేఖలో ఇంకా ఇలా ఉంది:

వేతనాల కమిటీ నిఫార్సుల పట్ల కొందరు ఎన్. జి.ఓ.లు వైఖరి ఫలానా విధంగా ఉన్నదని కూడా మీరు తెలియజేయ బడింది. అయినప్పటికీ ప్రభుత్వం ఉదార బుద్ధిని ప్రదర్శించి ఎన్. జి. ఓ. లు ఫిర్యాదులను పరిష్కరించ టానికి మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించటం ద్వారా వెంటనే తగు చర్యలు గైకొన్నది.

ప్రస్తుత వేతనాల స్కేళ్లలో అవకతవకలని మీరు చెప్పిన విషయాలను అవకతవకలుగా భావించటానికి అవకాశమే లేదు. నివేదికపై సంతకం చేసి ఇంత కాలం గడచిన తర్వాత వేతనాలను ఇంకా హెచ్చించాలని మీరు ఇస్తున్న సలహా ఆచరణ యోగ్యమైనది కాదని అందుకు దానిని అంగీకరించ జాలమని తెలుపుతున్నాను. సాధ్యమైనంత వరకే అభిప్రాయంతోనే మీరా నిఫార్సు చేశారని నేను అనుకోను.

సెక్రటేరియట్ సూపరింటెండెంట్ల ప్రారంభ వేతనం యథాతథంగా ఉంచాలని, పోలీస్ కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ళు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు ప్రారంభ వేతనం హెచ్చించాలని కమిటీలో నేను కోరినప్పుడు మీరు తీవ్రంగా ప్రతిఘటించారన్న విషయం మీ పట్టుదలను చూచి విభేదాలు రాకుండా ఉండాలనే ఉద్దేశంతో నేను మీతో అంగీకరించటం జ్ఞాపకం చేసుకుంటారని తలిస్తాను. రాష్ట్ర మంతటా ఒకే విధమైన స్కేళ్ళు ఉండటానికి గాను కొన్ని స్కేళ్ళను తక్కువ స్థాయి నుంచి ప్రారంభించాలన్న మీసలహాను మీ పట్టుదల కారణంగానే కమిటీలోని ఇతర సభ్యులు అంగీకరించారు. ఉదాహరణకు చెప్పాలంటే మీ బలవంతం కారణంగానే హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ప్రారంభ వేతనాన్ని కమిటీ ప్రస్తుత స్థాయిలో (అంటే రూ. 41, రూ. 30.) ఉంచటానికి అంగీకరించినది. ఇతర నాల్గవ తరగతి ఉద్యోగుల జీతాలలో హెచ్చింపు దృష్ట్యా కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల ప్రారంభ వేతనం రూ. 39, రూ. 45 ఉండాలని నేను సూచించాను. కాని మీరు అంగీకరించ లేదు. కానిస్టేబుళ్ల ప్రారంభ వేతనం 32 రూపాయలు ఉంచటానికి కూడా మీరు అంగీకరించ లేదు. అలాగే సెకండ్‌గ్రేడ్ ట్రెయిన్డ్ ఉపాధ్యాయుల స్కేలులో గరిష్ఠ పరిమితిని తగు విధంగా హెచ్చించటానికి అంగీకరించిన పక్షంలో వారి ప్రారంభ వేతనం 40 రూపాయలు ఉంచటానికి కూడా మీరు అంగీకారాన్ని ప్రకటించారు. వేరే కొందరు సభ్యుల పట్టుదల వల్ల గరిష్ఠ పరిమితి 120 అలాగే ఉంచుతూనే ప్రారంభ వేతనాన్ని 45 రూపాయలకు హెచ్చించటం జరిగింది. తెలంగాణా ప్రాంతంలో వివిధ తరగతుల టీచర్లకు విద్యా, ట్రెయినింగ్ అర్హతలను నిర్ణయించాలనిమీరే సూచించారు.

మీరు మాస్కో వెళ్ళటానికి ముందు ఆఖరు సమావేశం జరిగిన రోజున 1958 నవంబర్ 30 వ తేదీనాడు కేంద్ర పౌర వ్యయశాఖ మంత్రి శ్రీ బి. గోపాలరెడ్డి, భారత కాంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ శ్రీ ఎ. కె. చందా గారలకు కమిటీ సభ్యులను పరిచయం చేయటానికి నేను ఏర్పరచిన విందు సందర్భంలో మీకు మీరై స్వయంగానే సవరించబడిన స్కేళ్ళ పట్ల సంపూర్ణ సంతృప్తిని ప్రకటించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మేం చేయ గల్గిన దంతా చేశామని అన్నారు. ఇప్పుడు మీరు మీ మాటలనే కాదంటున్నారు. ఇప్పుడు కానిస్టేబుళ్ళకు 35–65, హెడ్ కానిస్టేబుళ్ళకు 50-85, సెకండరీ గ్రేడ్ టీచర్లకు 55-150 స్కేళ్ళు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నారు. మీరు మీ అభిప్రాయాలను మార్చుకొన్నట్టయితే అలా చేశానని చెప్పటం ధర్మం.

ఆఖరున ముఖ్య మంత్రి వేతనాల కమిటీని ఎవరో ఒత్తిడి చేసినందువల్ల నియమించలేదని, తక్కువ వేతనాలు తెచ్చుకునే ఉద్యోగుల పరిస్థితిని వృద్ధి పరచటానికే అలా చేశారని మరవరాదని ఆర్థిక మంత్రి కోరారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 16

తెలంగాణా గ్రామాధికారి సంఘ కార్యవర్గం సెప్టెంబర్ 20వ తేదీన లింగంపల్లి లోని తన కార్యాలయంలో సమావేశ మౌతున్నది.



## స్వదేశీ పైపు ఫౌండ్రీ

హైదరాబాద్, సెప్టెంబర్ 15

మద్రాస్ స్వదేశీ పైపుఫౌండ్రీ వారి హైదరాబాద్ కాబ్రా నాకు నిన్న సాయంత్రం సనత్‌నగర్ పారిశ్రామిక క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ విద్యామంత్రి శ్రీ పట్టాభి రామారావుగారు ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో జరిగిన సభకు శాసన పరిషత్తు అధ్యక్షులు పద్మభూషణ శ్రీ మాడపాటి హనుమంతరావుగారు అధ్యక్షత వహించారు. జంట నగరాలలోని పారిశ్రామిక యజమానులు, వ్యాపారస్థులు, పుర ప్రముఖులు పెక్కురిసభకు విచ్చేశారు.

సింహద్వారమునకు అడ్డముగా కట్టి వుంచిన నిల్కు రిబ్బను కత్తిరించుటతో మంత్రిగారు ఫౌండ్రీకి ప్రారంభోత్సవం జరిపారు.

స్వదేశీ పైపు ఫౌండ్రీ యజమానులలో ఒక భాగస్వామియైన శ్రీ టి. యస్. షణ్ముఖ సుందరం మంత్రిగారిని ఫౌండరీలోనికి తీసుకువెళ్ళి, పైపులు మూసలోనే వివిధ యంత్రాలను చూపి, ఫౌండ్రీలో అచ్చు పైపులు తయారు అయ్యే విధానమును వివరించారు.

యాభై సంవత్సరాలక్రితం, అందరి కన్న ముందుగా, మద్రాస్‌లో స్వదేశీ పైపు ఫౌండ్రీవారు, అచ్చు పరిశ్రమను స్థాపించి, తెలుగు, హిందీ, యింగ్లీషు మున్నగు 14 భాషలలో అచ్చుపైపులు దేశమంతటికీ సప్లయి చేస్తున్నారు.

శ్రీ పట్టాభి రామారావుగారు తమ ఉపన్యాసంలో నిరుద్యోగ నిర్మూలనా కృషిలో పరిశ్రమల పాత్రను వివరిస్తూ, పరిశ్రమల పెంపు ద్వారా జాతీయ సంపద పెంపు కాగలదని పుద్ఘాటించారు. శ్రీ టి. యస్. బాలసుందరం గారు మంత్రికి స్వాగత పత్రం చదివారు. డాక్టర్ గిడుగు సీతాపతిగారు సభాంతమున వందనములు సమర్పించారు. మొదట్లోనే ప్రముఖ అతిథులకు ఫౌండ్రీ మేనేజింగ్ పార్టనర్ శ్రీ టి. ఏ. సుబ్రహ్మణ్య మొదలియార్ స్వయముగా యెదురేగి, స్వాగతం చెప్పారు. ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ, లోక్ సభ స్పీకర్ శ్రీ అనంతశయనం అయ్యంగార్, కేరళ గవర్నర్ శ్రీ బూర్గుల రామకృష్ణరావు, శ్రీమాన్ సి. రాజగోపాలాచారి, శ్రీ కామరాజ నాడార్ ఫౌండ్రీ విజయము నాశిస్తూ పంపిన సందేశాలు సభలో చదివారు.

## నగరంలో సాంఘిక విద్యా పరిశ్రమాగారం

హైదరాబాద్, సెప్టెంబర్ 15

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆవరణలో అమెరికా ఫోర్డు ఫౌండేషన్ వారి ఆర్థిక సహాయంతో ఒక సాంఘిక విజ్ఞాన పరిశ్రమాగారం ఏర్పాటు చేయబడింది. ఈ పరిశ్రమాగారానికి నిన్న సాయంత్రం ఫోర్డు ఫౌండేషన్ ప్రతినిధి ఖ్యువా ప్రారంభోత్సవం జరిపారు. ఈ సందర్భంలో జరిగిన సభకు వైస్-ఛాన్సెలర్ శ్రీ డి. సదాశివరెడ్డి అధ్యక్షత వహించారు.

ఈ స్కీము విషయమై అప్పటి వైస్-ఛాన్సెలర్ శ్రీ భగవంతంగారు 1956 లోనే భారత ప్రభుత్వం వారికి సూచించారని జ్ఞప్తికి తెస్తూ, మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు పాఠ్యక్రమంలో సాంఘిక విజ్ఞాన శాస్త్రమును చేర్చుట ద్వారా ఉస్మానియా విశ్వవిద్యాలయం అనేక యితర రంగాలలో వలెనే యీ విషయంలోనూ ముందంజ వేస్తున్నందుకు యూనివర్శిటీ అధికారులను అభినందించారు.

సాంఘిక, నైతిక విలువల ప్రాధాన్యమును గుర్తింప జేస్తూ, విద్యార్థులకు సర్వ శాస్త్రముల ప్రాథమిక పరిజ్ఞానం కల్గించుటలో యీ సాంఘిక విజ్ఞాన పరిశ్రమాగారాలు చక్కగా తోడ్పడ గలవని శ్రీ ఖ్యువా అన్నారు.

Edited by K. S. Subrahmanyam, published by Smt. Sita Yudhvir, and printed at the Janatha Trust Press, Gandhi Bhavan, Mukarramjahi Road, Hyderabad.

## ముఖ్య మంత్రి ప్రకటన

(1 వ పేజీ తరువాయి)

తాలు తప్పించి తక్కినవన్నీ మునిగిపోయాయి. దుమ్ముగూడెం పాత, కొత్త పట్టణాలు రెండూ జలమయమైనవని ముఖ్య మంత్రి తెలియజేసారు. బూర్గుంపాడు కూడా నీట మునగటం వల్ల, ప్రజలు దానిని ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళారని ఆయనఅన్నారు.

ఈసారి ఒక ప్రత్యేక విశేషం ఏమిటంటే 14 అడుగులకు మించి వరుసగా నేటికి 25 రోజుల నుంచి వరద నీరు పారుతున్నది. దీని వల్ల గట్లు నానిపోయే అవకాశం ఉన్నదని,ముఖ్యంగా ప్రభుత్వ కాపలా సిబ్బందికి నిద్రాహారాలు లేకుండా చాలా శ్రమ పడవలసి వచ్చిందని శ్రీ సంజీవరెడ్డి అన్నారు. అయితే, అధికారులు, అనధికారులు అనే భావం లేకుండా అంతాకలిసి కట్టుగాను, అతి ఉత్సాహంతోనూ పరిస్థితిని ఎదుర్కొంటున్నారని, భయం కాని, ఆందోళన కాని ఎక్కడా కనిపించలేదని, రాజమండ్రిలో మామూలుగా ఎవరి పనులు వారు చేసుకు పోతున్నారని ఆయన తెలియ జేసారు. రాజమండ్రిలో పల్లపు ప్రాంతాలలోని వారిని ఖాళీ చేయించి, ఆర్ట్స్ కాలేజి, మునిసిపల్ హైస్కూలు మున్నగు భవనాలలో వారికి వసతి, భోజన ఏర్పాట్లు చేసారని ముఖ్య మంత్రి వెల్లడించారు.

వరదల వల్ల కలిగిన నష్టం ఎంతో ఇప్పట్లో అంచనా వేయటం కష్టమని ముఖ్య మంత్రి అన్నారు. నీరు తీసేసిన తర్వాతనే నష్టం ఎంత వచ్చిందో తేలుస్తుందని ఆయన అన్నారు.

ప్రతి యేడాది ప్రాణాలను అరచేతులలో పెట్టుకొని ఆందోళన పడే బదులు, వరదలను నిరోధించటానికి శాశ్వత చర్యలను చేపట్టటం మంచిది కాదా అని ఒక విలేఖరి ప్రశ్నించగా, వరద తగ్గు ముఖం పట్టిన తర్వాత దానిని గురించి ఆలోచించవచ్చునని ముఖ్య మంత్రి అన్నారు. ఇటీవల గోదావరి నది గట్లను కట్టుదిట్టం చెయ్యటానికి 40 లక్షల రూపాయల వరకు ఖర్చు చేశారని ఆయన అన్నారు. గోదావరి నదిపై ప్రాజెక్టులను నిర్మించినంత మాత్రాన వరద ఉధృతం తగ్గదని, గోదావరి నీరును కృష్ణా బేసిన్ లోనికి మళ్ళించటం కూడా అవసరమని, దీని కంటకూడా ఒక సమగ్రమైన ఒక పెద్ద పథకం వెయ్యాలని శ్రీ సంజీవరెడ్డి అన్నారు.

మొత్తం మీద పరిస్థితి అంత ఆందోళన కరంగా లేదని ఆయన అన్నారు.

## జనరల్ చౌధురి అస్వస్థత

హైదరాబాద్, సెప్టెంబర్ 15

హైదరాబాద్ మాజీ మిలటరీ గవర్నర్ జె. యన్. చౌధురీ, తిరుమలగిరిలోని స్థానిక మిలటరీ వైద్యశాలలో కొంత కాలంగా చికిత్స పొందుతున్నారు.

ఈ వుదయం గవర్నర్ సతీ సమేతంగా వెళ్ళి వారినిచూచి పరామర్శించినారు. సాయంత్రం ముఖ్య మంత్రి సంజీవరెడ్డిగారు సందర్శించి వచ్చారు.

## మంత్రుల పర్యటనలు

కార్మిక, స్థానిక పరిపాలనా శాఖా మంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య 19:9 సెప్టెంబర్ 19వ తేదీ మధ్యాహ్నం 12-45 గంటలకు బైలుదేరి కర్నూలు వెళ్తారు. అచటినుంచి ఎమ్మిగనూరు, పత్తికొండ, పల్లకుర్తి వెళ్ళి సెప్టెంబర్ 21వ తేదీ రాత్రి 8-33 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి వస్తారు.

## రష్యా హిమవిచ్ఛేదక నౌక తొలియాత్ర

మాస్కో, సెప్టెంబర్ 15

సోవియట్ యూనియన్ నిర్మించిన అణు హిమవిచ్ఛేదక నౌక నేడు తొలి యాత్ర ప్రారంభించినది. శ్రీ కృశ్చేవ్ అమెరికా యాత్రకై బైలుదేరుతున్న సమయంలో టాస్ వార్తా సంస్థ ఈ వార్త వెల్లడించినది.

## "చైనా స్నేహభావాన్ని దుర్వినియోగ పరచుకోరాదు"

### ఇండియాపై పంచన్‌లామా విమర్శ

హాంకాంగ్, సెప్టెంబర్ 15

స్నేహంగా ఉండాలని కోరుతున్నాం కదా అని మమ్మల్ని అనవసరంగా ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించరాదని భారత నాయకులకు హెచ్చరిక చేయదలచానని టిబెట్ తాత్కాలిక పాలకుడు పంచన్‌లామా నిన్న లాసాలో అన్నట్టు నవచైనా వార్తా సంస్థ ప్రకటించినది.

చైనా, భారత ప్రజల మధ్య స్నేహ సంబంధాలు ఉండాలనుకుంటే భారత నాయకులు కొంచెం మర్యాదగా ప్రవర్తించాలని ఆయన అన్నారు. భారత దేశం టిబెట్ తిరుగుబాటు దారులను ప్రోత్సహించినదని, మాతృదేశ ద్రోహకరమైన చర్యలు కొనసాగించటానికి వారు ఇండియాకు తరలి వెళ్లారని పంచన్‌లామా అన్నారు.

రాజ్య విస్తరణా కాంక్షతో భారత ప్రభుత్వం టిబెట్‌కు చెందిన పెద్ద భూభాగాలను తమవిగా కోరటం శోచనీయమని ఆయన అన్నారు. సరిహద్దుపై ఇండియా సైనిక చర్యలు కూడా ప్రారంభించినదని ఆయన అన్నారు.

"మా సైనికులు రక్షణ చర్యలు గైకొనగా ఇండియా ప్రభుత్వం మొగుడినికొట్టి మొర పెట్టుకొన్నట్టు తప్పంతా చైనాదేనని ప్రపంచ ప్రజలను మోసగించ ప్రయత్నిస్తున్నదని' ఆయనఅన్నారు.

సరహద్దు వివాదాలను పరిష్కరించుకోటానికి ఉభయ దేశాలు కృషి చేయాలని ఆయన అన్నారు.

1956–57 లో తాము భారత దేశాన్ని సందర్శించినప్పుడు చైనీస్ ప్రజల పట్ల భారతీయులు ఎంతో స్నేహభావాన్ని కలిగి ఉండటం చూచామని, ఇప్పుడు భారత ప్రభుత్వం గైకొంటున్న చర్యలు స్నేహితుడు చేయ వలసిన పనులు కావని పంచన్‌లామా అన్నారు.

లాసాలోని చైనీస్ ప్రతినిధి జనరల్ చాంగ్ చింగ్ ప్రస్తుత ఉద్రిక్తతకు బాధ్యతంతా భారత ప్రభుత్వానిదే నన్నట్టుకూడా నవచైనా వార్తా సంస్థ ప్రకటించినది.

## బెంగాల్ అసెంబ్లీ ముందు ప్రదర్శన

కలకత్తా, సెప్టెంబర్ 15

పశ్చిమ బెంగాల్ శాసన సభ సమావేశం ప్రారంభమయ్యే రోజున శాసన సభ ముంగిట (సెప్టెంబర్ 21) ఆహారోద్యమ కమిటీ వారు ప్రదర్శనం చేయటానికి నిర్ణయించారు.

## రాజమండ్రి పట్టణంలో పరద పరిస్థితి

(1వ పేజీ తరువాయి)

కారులు ఒకరితో ఒకరు బాగా సహకరించి పనిచేస్తున్నారని విలేఖరులతో అన్నారు.

డెల్టా ప్రాంతాలన్నిటిలో పర్యటించి వచ్చిన జిల్లా కలెక్టర్ శ్రీ ప్రతాప రెడ్డి కొంతదూరం మోటారు మీద, కొంత సైకిళ్ మీద, కొంత కాలినడకన ప్రయాణం చేయవలసి వచ్చిందని అన్నారు. వరదల మూలంగా ఎంత నష్టం సంబంధించినదీ పూర్తి వివరాలు యింకా అందటం లేదు.

### ఆనకట్ట వద్ద పరిస్థితి

ధవళేశ్వరం ఆనకట్ట వద్ద నీటి మట్టం నేటి సాయంకాలానికి (6 గంటలు) 18.4 అడుగుల దాకా పెరిగినది. అధికారులైతే నీటి మట్టం ఇక పెరగదనే అంటున్నారు.

ఆనకట్ట వద్ద నీటి మట్టం ఒకవేళ 19 అడుగుల దాకా పెరిగినా పోలవరం నుంచి సముద్రం వరకు ఏటిగట్లు భద్రంగానే ఉన్నాయి కనుక ప్రమాదం ఏమీ సంభవించదు.

వాతావరణం కూడా అనుకూలంగానే ఉన్నది. ఎగువ భాగంలో గత రెండు రోజులుగా వానలు లేవు, ఒక్క పెనుగంగ దగ్గర తప్పించి. శబరిలో నీటి మట్టం తగ్గిపోతున్నది.

మొత్తం మీద పరిస్థితి ఏమిటంటే రేపటికి ఉపద్రవం దాటిపోయి నీటిమట్టం తగ్గటం ప్రారంభించవచ్చు. ఈ యేడాది వరదల్లో ఎక్కువగా దుమ్ముగూడెం, పోలవరం మధ్య భాగానికి బాగా దెబ్బ తగిలినది.

దుమ్ముగూడెం, ఎగువ భద్రాచలం, పోలవరం, దిగువ భద్రాచలం మధ్య పథ్నాల్గు మైళ్ళ దాకా లోపలికి వచ్చింది. దుమ్ముగూడెం, భద్రాచలం, బూర్గుంపాడు, కూనవరం, పోలవరం టౌన్లు పూర్తిగా మునిగిపోయాయి. కొన్ని ప్రాంతాలలో కేవలం చెట్లు మాత్రమే కనిపిస్తున్నాయి.

కొత్తగూడెం నుంచి వస్తున్న వార్తల ప్రకారం భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలోను, బూర్గుంపాడు ప్రాంతాలలో వరదల మూలంగా మొత్తం 60 వేల మంది ప్రజలకు దెబ్బతగిలినది. వారంతా దాదాపు నిరాశ్రయులైనారు. ఈ ప్రాంతం అంతా పెద్ద నీటి మడుగులా కనిపిస్తున్నది.

## మంగోలియా ప్రధాని భారత పర్యటన సమాప్తి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16

ఇండియాలో ఏడురోజుల పర్యటన పూర్తి చేసుకొని మంగోలియా ప్రధాని సపరివారంగా నేడిక్కడి నుంచి విమానంలో మాస్కో బయల్దేరి వెళ్లారు.

విమానాశ్రయంలో మంగోలియా ప్రధానికి ఉప రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణ, కేంద్ర మంత్రులు, విదేశ రాయబారులు వీడ్కోలు నిచ్చారు.

భారత పర్యటన సందర్భంగా తీసిన ఫొటోల ఆల్బం ఒకటి మంగోలియా ప్రధానికి బహూకరించబడినది.

## ఉరిశిక్ష అమలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15

చిత్తూరు జిల్లాకు చెందిన మిలిటరీ సుబ్బుడు అనే సుబ్బయ్య, పలమనేరు తాలూకా లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఏడుకొండలవాడు కలసి ముగ్గురు పిల్లలను హత్యచేసిన నేరానికి జిల్లా జడ్జి విధించిన ఉరిశిక్షను హైకోర్టు ఖాయం చేసినందున ఈ నెల 7వ తేదీ రాజమండ్రి జైలులో వారిద్దరిని ఉరితీశారు.

## పాక్ స్త్రీలకు ఓటింగ్ హక్కు ఉండదన్న వార్త ఖండన

కరాచీ, సెప్టెంబర్ 15

పాకిస్తానీ మహిళలకు ఎన్నికలలో పాల్గొనే హక్కు ఉండదన్న వార్తను పాక్ ప్రభుత్వం నేడు ఖండించినది. యూనియన్ పంచాయతీ ఎన్నికలు వయోజన ఓటింగ్ పద్ధతిపై జరుగుతాయని ప్రభుత్వం ప్రకటించినది.

## బీహార్‌లో భూవసతికి గరిష్ఠ పరిమితి

### ముసాయిదా ప్రతిపాదనల వివరాలు

పాట్నా, సెప్టెంబర్ 15

రకాన్ని బట్టి భూవసతికి 30 ఎకరాల నుంచి 90 ఎకరాల వరకు గరిష్ఠ పరిమితి నిర్ణయిస్తున్న ముసాయిదా ప్రతిపాదనలను బీహార్ మంత్రివర్గం నిన్న రాత్రి సమావేశంలో ఆమోదించినట్టు తెలుస్తున్నది.

ఈ ముసాయిదా ప్రతిపాదనల ప్రకారం భూములు ఐదుతరగతులలో విభజించబడినాయి. గరిష్ఠ పరిమితి వివరాలు ఈ విధంగా ఉన్నాయి:

(1) కాలువల క్రింద సాగు చేయబడుతున్న భూములకు గరిష్ఠ పరిమితి 30 ఎకరాలు.

(2) గొట్టపు బావుల క్రింద సాగు చేయబడుతున్న భూములకు గరిష్ఠ పరిమితి 45 ఎకరాలు.

(3) నీటి పారుదల సౌకర్యాలు లేని భూములకు 60 ఎకరాలు.

(4) నదీ తీరస్థ (కొట్టుకొని పోవటం, వరద దెబ్బ తినటం జరుగుతుంది గనక) భూములకు 75 ఎకరాలు.

(5) కొండ ప్రాంతాలలోని భూములకు 90 ఎకరాలు.

పరిహారం అమ్ముకోటానికి వీలుకల్గి, వడ్డీ చెల్లే బాండుల రూపంలో 20 సమానమైన వాయిదాలలో చెల్లించబడుతుంది. ఈ ప్రతిపాదనలు కల బిల్లు ఒకటి అసెంబ్లీ ప్రస్తుత సమావేశంలోనే ప్రవేశ పెట్టబడుతుంది.

## పుస్తక ముద్రణ పోటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 16

కేంద్ర మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న పుస్తక ముద్రణ, డిజైనింగ్ పోటీ వచ్చే నవంబర్ నెలాఖరులో జరుగుతుంది. బహుమతులు 25తరగతులుగా విభజించబడ్డాయి.

## విదర్భ నినాదం

(1వ పేజీ తరువాయి)

పట్టణంతో సహా మహారాష్ట్రాన్ని ఏర్పరచటం ఆ ప్రాంతాలలోని ప్రజలందరికీ లాభదాయకం అనీ, కాబట్టి ప్రస్తుత బొంబాయి, రాష్ట్రాన్ని రెండు రాష్ట్రాలుగా మాత్రమే విభజించాలనీ ఆ తీర్మానంలో తన అభిప్రాయాన్ని స్పష్టీకరించినది.

తీర్మానాన్ని 34 గురు బలపర్చగా, ఏగురు వ్యతిరేకించారు.

వ్యతిరేకించిన వారి పేర్లు: శ్రీయుతులు ఎమ్. ఎస్. ఆనే, బ్రిజలాల్ బయానీ, మధుసూధన్ వైరాలే, తారాచంద్ సురానా, శ్రీమతి గిరిజాబాయి కతానే.

విదర్భ ప్రదేశ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీ జి. వి. ఖేడ్కర్ తీర్మానాన్ని ప్రతిపాదించగా ప్రస్తుత విదర్భ ప్రాంతీయ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి శ్రీ పి. ఎన్. ఖోడే బలపరిచారు.

ప్రస్తుత బొంబాయి రాష్ట్రాన్ని విభజించినప్పుడు విదర్భ ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని శ్రీయుతులు ఆనే, బ్రిజలాల్ బయానీ గార్లు ఆందోళన సాగిస్తున్న విషయం పాఠకులకు విదితమే.

## జనరల్ అసెంబ్లీకి నూత్న అధ్యక్షుడు

### పెరూ ప్రతినిధి ఎన్నిక

ఐక్యరాజ్యసమితి, సెప్టెంబర్ 15

పెరూ మాజీ విదేశాంగమంత్రి, సమితిలో పెరూ ప్రతినిధివర్గం నాయకుడు అయిన డాక్టర్ విక్టర్ ఆండ్రెస్ బెలాండి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 19 వ సమావేశానికి అధ్యక్షుడుగా నేడు పోటీ లేకుండా ఎన్నికైనారు.

## గీతానృత్య కళాశాల

విజయనగరం, సెప్టెంబర్ 10

శ్రీ సువర్ణకుమార్ నిర్వహిస్తున్న గీతానృత్య కళాశాలకు మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి రాక సందర్భంలో విద్యార్థులు నిన్న నృత్యప్రదర్శనం చేశారు. మంత్రితోపాటు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య కూడా ఉన్నారు.

## ప్రపంచ బ్యాంక్ పెట్టుబడి రెట్టింపు

పారిస్, సెప్టెంబర్ 16

ప్రపంచ బ్యాంక్ మూల ధనం పది వేల మిలియన్ డాలర్ల నుంచి 21 వేల మిలియన్ డాలర్లకు పెరిగినట్టు బ్యాంక్ అధ్యక్షుడు ప్రెయూజిన్ బ్లాక్ నేడు ప్రకటించారు.

నిన్నటి వరకు సభ్యత్వ దేశాలనుంచి హామీ పొందబడిన వాటా మొత్తాలు 9000 మిలియన్ డాలర్ల వరకు చేరినట్టు ఆయన వెల్లడించారు. ఇందులో 62,520,000 డాలర్లు జమ కట్టుకోవడం జరుగుతుందనీ, మిగతా మొత్తాన్ని బ్యాంక్ వ్యవహారాలకు వినియోగిస్తారనీ ప్రకటనలో పేర్కొన్నారు.

బ్యాంక్ మూలధనం పెంచటానికి 40 సభ్యత్వ దేశాలు హెచ్చు వాటా మొత్తాలు పంపినవి.


రేపే బ్రహ్మాండమైన విడుదల

పొన్నలూరి బ్రదర్స్ వారి

దైవబలం

సగానికి పైగా కలరు

డైరెక్షన్

వసంతకుమార రెడ్డి

ఎన్. టి. రామారావు, రేలంగి, రమణారెడ్డి, జయశ్రీ, గిరిజ, మాలతి మొ॥

ప్యాలెస్ హైదరాబాద్ — రాజేశ్వర్ సికిందరాబాద్

ఆటల సమయాలు : 3-00, 6-15, 9-30

రాజరాజేశ్వరి

- సవయుగ రిలీజ్ -



నేడే బ్రహ్మాండమైన విడుదల!

కుటుంబం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేసిన ఒక ఇల్లాలి గాథ .....

రమణ్ బి. దేశాయ్ సమర్పించు

గృహలక్ష్మి

ఇంతకుముందు ఏ చిత్రంలోను లేనటువంటి సాము డాన్సు ఒక ప్రత్యేకత.

పండరీబాయి

సాహు మోడక్

లలితాపాపర్.

ప్యారడైజ్ సికిందరాబాద్

ఆటల సమయాలు 3-30, 6-30, 9-30.

(Nima) — బాలాజీ పిక్చర్స్ రిలీజ్ —



రేపు మ॥ 3-30 గం॥కు గొప్ప విడుదల!

సిప్పీ ఫిల్మ్స్ వారి

భాయి బహెన్

జానీవాకర్, డెయిసీ ఇరాని, బేబీ నాజ్, రెహమాన్, నిశి, రమేశ్, పమ్మీ, నీలోఫర్, అన్వర్ హుస్సేన్.

కథ, దర్శకత్వం జి. పి. సిప్పీ — సంగీతం ఎన్. దత్తా — పాటలు సాహిర్

అశోక్ హైదరాబాద్ — మనోహర్ సికిందరాబాద్

(Trupix) — విజయ రిలీజ్ —